


# విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY

PUBLISHED FROM KURNOOL ఎడిటర్: ఆవుల విజయ భాస్కర రెడ్డి శుక్రవారం 22-04-2022 సంపుటి: 03 సంచిక: 218 పేజీలు: 4 వెల: రూ 3-00







# భయాలకు తావులేకుండా ప్రాజెక్టును నెలకొల్పారు: సీఎం జగన్





తూర్పుగోదావరి: బిక్కవోలు మండలం బలభద్రపురంలో గ్రాసిం ఇండస్ట్రీ కోర్ ఆల్కలీ యూనిట్‌ను బిర్లా గ్రూప్ చైర్మన్ కుమార మంగళం బిర్లాతో కలిసి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం జగన్ మాట్లాడుతూ.. 'గ్రాసిమ్ పరిశ్రమ ద్వారా రాష్ట్రానికి రూ. 2,700 కోట్లు పెట్టుబడులు వచ్చాయి. ప్రత్యక్షంగా 1300మంది, పరోక్షంగా 1150 మందికి అవకాశం లభిస్తుంది. ఇలాంటి కంపెనీలు రావడంతో ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయి. 75 శాతం స్థానికులకు ఉపాధి కల్పించేలా ఇప్పటికే రాష్ట్రంలో చట్టం చేశాం. ఈ పరిశ్రమలో టెక్నాలజీలో మార్పు ద్వారా జీరో లిక్విడ్ వేస్ట్ డిశ్చార్జ్ అవుతుంది. భయాలకు తావులేకుండా ప్రాజెక్టును నెలకొల్పారు. గత ప్రభుత్వం ఎన్నికలకు రెండు నెలల ముందు గ్రాసిమ్ సంస్థకు ప్రాజెక్ట్ అప్పగించింది. గత ప్రభుత్వం సమస్యలు పరిష్కారం కాకుండా సంతకాలు చేసింది. మన ప్రభుత్వం వచ్చాక అన్ని సమస్యలు పరిష్కరించి కంపెనీ పనులు ముందుకు సాగేలా చేశాం. అవరోధాలను ఒక్కొక్కటిగా తొలగించి ప్రాజెక్టును నెలకొల్పామని సీఎం జగన్ అన్నారు. బిర్లా గ్రూప్ కాస్టిక్ సోడా యూనిట్ ప్రారంభం సందర్భంగా ఆదిత్యా బిర్లా గ్రూప్ ఛైర్మన్ కుమార మంగళం బిర్లా మాట్లాడుతూ పరిశ్రమల ఏర్పాటుకు ఏపీ ప్రభుత్వం అవలంభిస్తున్న విధానాలను కొనియాడారు. పరిశ్రమలో 75 శాతం మంది స్థానికులకు అవకాశం కల్పించనున్నట్లు తెలిపారు. దీని ద్వారా సుమారు 2,500 మంది ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి పొందనున్నట్లు వివరించారు. భూగర్భ జలాలు కాలుష్యం కాకుండా ఆధునిక సాంకేతికతతో గ్రాసిమ్ పరిశ్రమను ఏర్పాటు చేశామని కుమార మంగళం బిర్లా తెలిపారు. పరిశ్రమల ఏర్పాటులో సీఎం జగన్ సహకారం మరవలేనిదంటూ కృతజ్ఞతలు తెలియజేశారు. అయితే అంతకు ముందు గ్రాసిమ్ ఇండస్ట్రీస్ ప్లాంట్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక వాహనంలో ఆదిత్య బిర్లా గ్రూప్ ఛైర్మన్ కుమార మంగళం బిర్లాతో కలిసి సీఎం జగన్ ప్లాంట్‌ను సందర్శించారు. ఆదిత్య బిర్లా గ్రూపు భారీ స్థాయిలో రూ. 2700 కోట్ల పెట్టుబడితో కాస్టిక్ సోడా ప్లాంట్ ఏర్పాటు చేసింది. ప్లాంట్ ఏర్పాటు ద్వారా స్థానికులకు ప్రత్యక్షంగా, పరోక్షంగా కూడా ఉద్యోగ అవకాశాలు లభిస్తున్నాయి. ఆదిత్య బిర్లా గ్రూపులో ఒకటైన గ్రాసిమ్ కంపెనీ ముఖ్యమంత్రి చొరవతో ఈ ప్లాంట్ నిర్మాణానికి ముందుకు రావడంతో స్థానికులకు ఉద్యోగ అవకాశాలు మెండుగా లభిస్తాయని సంతోషపడుతున్నారు.

## అలా అయితే టీడీపీ ప్రతిపక్షంలోనే ఉండిపోతుంది: చంద్రబాబు

విజయవాడ: తెలుగుదేశం పార్టీలో సీనియారిటీని గౌరవిస్తామని, సిన్సియారిటీని గుర్తిస్తామని టీడీపీ అధినేత చంద్రబాబు అన్నారు. గురువారం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ... సీనియారిటీ ఉన్నా.. ఓటు వేయించలేని పరిస్థితే ఉంటే ఏం లాభమన్నారు. ఓట్లు వేయించలేని సీనియర్లు కూడా తమకే ప్రాధాన్యమివ్వాలని కోరితే.. టీడీపీ ప్రతిపక్షంలోనే ఉండిపోతుందన్నారు. 40 శాతం యువతకు సీట్లిద్దామన్న పార్టీ నిర్ణయానికి కట్టుబడి ఉన్నామన్నారు. కొందరు సీనియర్ నేతల వారసులు రాజకీయాల్లోకి వచ్చారని, ఇంకొందరు ఉద్యోగాలు, వ్యాపారాలు చేసుకుంటున్నారన్నారు. సీనియర్ నేతల వారసులే కాదు.. తటస్థ యువకులనూ పార్టీలోకి ఆహ్వానిస్తున్నామని చంద్రబాబు అన్నారు. పార్టీలో పని చేసే యువ నేతలనూ గుర్తిస్తామని, అవకాశాలిస్తామని స్పష్టం చేశారు.

# రాజ్యాంగం, ఆత్మప్రబోధం మేరకు అధికారులు పనిచేయాలి-ఉపరాష్ట్రపతి



హైదరాబాద్: సివిల్ సర్వీసెస్ అధికారులు తమ శక్తిసామర్థ్యాలకు అనుగుణంగా పనిచేసే విషయంలో ఎదురవుతున్న అడ్డంకులపై ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు ఆందోళన వ్యక్తం చేశారు. అధికారులకు వారి పనితీరు ఆధారంగానే పదోన్నతులు లభించాలనే విషయంలో సంస్కరణలు తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. గురువారం సివిల్ సర్వీసెస్ డే సందర్భంగా హైదరాబాద్ లోని డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో ఏర్పాటుచేసిన కార్యక్రమానికి ఉపరాష్ట్రపతి ముఖ్య అతిథిగా విచ్చేశారు. విధి నిర్వహణలో ఏమైనా అనుమానాలొస్తే రాజ్యాంగంతో పాటు ఆత్మప్రబోధం మేరకు పనిచేయాలని ఆయన సూచించారు. స్వాతంత్ర్యానంతర భారతదేశం పురోగతిలో సివిల్ సర్వీసెస్ అధికారులు గణనీయమైన పాత్రను పోషిస్తున్నారన్న ఉపరాష్ట్రపతి.. పేదరికం, లింగ వివక్షత, సాంఘిక వివక్షత, మూఢ నమ్మకాలు వంటి సామాజిక దురాచారాలను పూర్తిగా నిర్మూలించేందుకు భవిష్యత్ లోనూ విశేషమైన కృషి జరగాల్సిన అవసరం ఉందన్నారు. ఈ దిశగా సివిల్ సర్వీసెస్ అధికారులు ప్రత్యేకమైన దృష్టిసారించాలన్నారు. ఈ విషయంలో రాజకీయ సిద్ధాంతాలు, ఇతర కోణాల్లో కాకుండా నిజాయితీ, సత్యసంధతలకే కట్టుబడాలని సూచించారు. రాజకీయ నాయకులు, అధికారుల మధ్య అనైతిక సంబంధం విషయంలో వస్తున్న విమర్శలపైనా ఉపరాష్ట్రపతి ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయ, సిద్ధాంత కోణంలో కాకుండా నైతికత ఆధారంగా లబ్ధిదారులకు మేలు చేయాలని ఉపరాష్ట్రపతి సూచించారు. కొన్ని రాష్ట్రాల్లో ప్రజలను ఆకట్టుకునేందుకు ఉచితాలను, ఆర్థిక పరిస్థితికి మించిన తాయిలాలను ఎన్నికల మేనిఫెస్టోల ప్రకటిస్తున్నారని ఇది రానున్న రోజుల్లో ఆయా రాష్ట్రాల ఆర్థిక పరిస్థితిపై పెను ప్రభావాన్నిచూపిస్తాయని ఆయన అన్నారు. దేశాభివృద్ధిలో సమర్థవంతమైన అధికారులు పోషించాల్సిన పాత్ర కీలకమన్న ఆయన.. రాజకీయాలకు అతీతంగా అధికారులు పనిచేయాలని సూచించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సూచించిన 'రిఫార్మ్, పర్ఫార్మ్, ట్రాన్స్ ఫార్మ్' నినాదంతో ముందుకెళ్లాలన్నారు. సమాజంలోనున్న చివరి వ్యక్తికి వరకు సంక్షేమ పథకాలు వెళ్లాలన్న ప్రభుత్వ నినాదం 'అంత్యోదయ'ను విజయంతంగా అమలుచేయాలన్నారు. వృత్తి జీవితంతో పాటు వ్యక్తిగత జీవితం మీద కూడా దృష్టి పెట్టాలని శిక్షణలో ఉన్న అధికారులకు సూచించిన ఉపరాష్ట్రపతి, మంచి ఆరోగ్య విధానాలను అవలంబించాలని సూచించారు. శారీరక ఆరోగ్యం ద్వారా మానసిక ఆరోగ్యం కూడా లభిస్తుందన్న ఆయన, ప్రతి రోజు కొంత సమయాన్ని యోగ సహా ఇతర వ్యాయామాలకు కేటాయించాలని సూచించారు. అనారోగ్యకరమైన కొంత మంది యువత ఆహారపు అలవాట్ల పట్ల ఆందోళన వ్యక్తం చేసిన ఆయన, మన వాతావరణ పరిస్థితులకు తగిన విధంగా పోషకాహారాన్ని తీసుకోవాలని, భారతీయ సంప్రదాయ ఆహారంలో పోషక విలువలు పుష్కలంగా ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంసీఆర్ హెచ్చార్డీ డైరెక్టర్ జనరల్ హర్‌ప్రీత్ సింగ్, అదనపు డీజీ మహేశ్ దత్ ఎక్కా, సంయుక్త డీజీ అనితా రాజేంద్రన్, శిక్షణలో ఉన్నవివిధ సర్వీసుల అధికారులు, బోధన సిబ్బంది పాల్గొన్నారు.

# ఆ కేసులను ఎత్తివేస్తున్నాం: సీఎం జగన్


తూర్పుగోదావరి: గతంలో గ్రాసిమ్ ప్రాజెక్టు సంబంధించి జరిగిన ఆందోళనల్లో 131 మందిపై కేసులు నమోదయ్యాయని.. ఆందోళనకారులపై ఆ కేసులను ఎత్తివేస్తున్నామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించారు. ఈ రోజే జీవో విడుదల చేస్తున్నామని తెలిపారు. బిక్కవోలు మండలం బలభద్రపురంలో గ్రాసిం ఇండస్ట్రీ కోర్ ఆల్కలీ యూనిట్‌ను



గ్రూప్ చైర్మన్ కుమార మంగళం బిర్లాతో కలిసి సీఎం జగన్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ, గ్రాసిమ్ పరిశ్రమతో ప్రత్యక్షంగా 1300 మంది, పరోక్షంగా 1150 మందికి ఉపాధి కలుగుతుందని సీఎం అన్నారు. 75 శాతం స్థానికులకు ఉపాధి కల్పించేలా చట్టం చేశామన్నారు. "ఎన్నికలకు 2 నెలల ముందు గత ప్రభుత్వం గ్రాసిమ్ సంస్థకు ప్రాజెక్ట్ అప్పగించింది. గత ప్రభుత్వం సమస్యలు పరిష్కారం కాకుండా సంతకాలు చేసింది. అన్ని సమస్యలు పరిష్కరించి కంపెనీ పనులు ముందుకు సాగేలా చేశామన్నారు. అవరోధాలను ఒక్కొక్కటికీ తొలగించి ప్రాజెక్టు నెలకొల్పామన్నారు. భూగర్భ జలాలు కాలుష్యం కాకుండా ఆధునిక సాంకేతికతో పరిశ్రమ ఏర్పాటు చేశారన్నారు. టెక్నాలజీ మార్పు ద్వారా జీరో లిక్విడ్ వేస్ట్ డిశ్చార్జ్ చేశారన్నారు. భయాలకు తావులేకుండా ప్రాజెక్టు నెలకొల్పారని" సీఎం వైఎస్ జగన్ అన్నారు.

## సీఎం కాన్వాయ్ కోసం ప్రజల వాహనాల స్వాధీనమేంటి?: పవన్

అమరావతి: ఒంగోలులో సీఎం జగన్ పర్యటన సందర్భంగా కాన్వాయ్ కోసం అధికారులు ప్రజల వాహనాలు స్వాధీనం చేసుకోవడమేంటని జనసేన అధినేత పవన్ కల్యాణ్



ప్రశ్నించారు. గురువారం ఆయన ఇక్కడ మీడియాతో మాట్లాడుతూ సీఎం పర్యటనకు ప్రభుత్వ వాహనాలు సమకూర్చలేని పరిస్థితొచ్చిందా? అని నిలదీశారు. ప్రయాణికుల కారును పోలీసులు లాక్కోవడం దుర్మార్గమన్నారు. ఎవరి ఒత్తిడితో ప్రయాణికుల కారును తీసుకున్నారో స్పష్టతివ్వాలని ఆయన డిమాండ్ చేశారు. లక్షల కోట్ల బడ్జెట్, అప్పులు కలిగిన ఏపీ ప్రభుత్వం.. సొంతంగా వాహనాలు సమకూర్చుకోలేదా? అని ఎద్దేవా చేశారు. సహాయ అధికారిని, హోంగార్డును సస్పెండ్ చేసేసి.. ఘటనను మరుగునపడేద్దామని ప్రభుత్వం భావిస్తున్నట్లుందని మండిపడ్డారు. ఒంగోలు ఘటనపై ప్రజలకు సీఎంవో వివరణ ఇవ్వాలని పవన్ కల్యాణ్ డిమాండ్ చేశారు.

# అంతర్గత భద్రతపై జాతీయ సమాచార నిధి : అమిత్ షా

న్యూఢిల్లీ : అంతర్గత భద్రతపై జాతీయ సమాచార నిధిని సిద్ధం చేసేందుకు కృషి జరుగుతోందని కేంద్ర హోం మంత్రి అమిత్ షా చెప్పారు. బాంబు పేలుళ్లు, ఉగ్రవాదానికి నిధులు, నకిలీ కరెన్సీ, మాదక ద్రవ్యాలు, హవాలా, ఆయుధాల అక్రమ రవాణా, ఉగ్రవాదం వంటివాటికి సంబంధించిన సమాచారంతో ఈ నిధిని తయారు చేస్తున్నట్లు తెలిపారు. కేసుల దర్యాప్తులో కేంద్ర దర్యాప్తు సంస్థలకు, పోలీసులకు ఈ సమాచారం ఉపయోగపడుతుందన్నారు. జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) 13వ వ్యవస్థాపక దినోత్సవాల సందర్భంగా గురువారం అమిత్ షా మాట్లాడారు. ఉగ్రవాద కేసుల దర్యాప్తు, నిందితులు దోషులుగా నిర్ధరణ కావడానికి ఉగ్రవాదంపై సమాచార నిధి చాలా ఉపయోగపడుతుందన్నారు. ఎన్ఐఏ, నేషనల్ ఇంటెలిజెన్స్ గ్రిడ్, ఇంటెలిజెన్స్ బ్యూరో ఈ నిధిని సిద్ధం చేసేందుకు కృషి చేస్తున్నాయన్నారు. ఏ సమాచారమైనా, దానిని గుప్తంగా ఓ చోట ఉంచడం వల్ల ప్రయోజనం ఉండదన్నారు. ఆ సమాచారాన్ని ఒకరికొకరు ఇచ్చి, పుచ్చుకుంటే, దానిని సక్రమంగా విశ్లేషిస్తే, దాని వల్ల చాలా ఉపయోగం ఉ



ంటుందన్నారు. గడచిన 13 ఏళ్ళలో ఎన్ఐఏ దర్యాప్తు చేసిన ఉగ్రవాద సంబంధిత కేసుల్లో దోషిత్వ నిర్ధరణ రేటు పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు.

అంతర్జాతీయ స్థాయికి... జమ్మూ-కశ్మీరులో ఉగ్రవాదానికి నిధులు సమకూర్చుతున్న సంఘటనలకు సంబంధించిన కేసుల దర్యాప్తులో ఎన్ఐఏ పనితీరును ప్రశంసించారు. కశ్మీరు లోయలో క్షేత్ర స్థాయిలో వర్కర్ నెట్‌వర్క్‌ను, ఉగ్రవాదాన్ని నిర్మూలించేందుకు ఇది దోహదపడిందన్నారు. అతి తక్కువ సమయం (13 సంవత్సరాలు)లోనే ఎన్ఐఏ అంతర్జాతీయ స్థాయికి ఎదిగిందన్నారు. ఉగ్రవాదానికి నిధులు, ఉగ్రవాదంపై దర్యాప్తు, మావోయిజానికి సంబంధించిన కేసుల్లో దర్యాప్తు కోసం ఎంతో శ్రమిస్తోందన్నారు. అన్ని విధాలుగా సహకారంభారత దేశాన్ని ఉగ్రవాద రహితం చేయడానికి ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందన్నారు. ఉగ్రవాదంపై పోరాటంలో ఎన్ఐఏకి అన్ని విధాలుగా సహకరిస్తామన్నారు. రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లోని యాంటీ టెర్రర్ దర్యాప్తు సంస్థలకు సహకరించాలని ఎన్ఐఏను కోరారు. పని తీరు భేష్2008 నవంబరు 26న ముంబై ఉగ్రవాద దాడుల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం 2009లో ఎన్ఐఏను ఏర్పాటు చేసింది. అప్పటి నుంచి 400కుపైగా కేసులను ఎన్ఐఏ దర్యాప్తు చేసింది. వీటిలో దోషిత్వ నిర్ధరణ జరిగిన కేసులు 93 శాతం వరకు ఉన్నాయి.

# వ్యవసాయ మంత్రిగా కాకాణి బాధ్యతలు..

తొలి రెండు సంతకాలు వాటిపైనే..



విజయవాడ: వ్యవసాయశాఖ మంత్రిగా కాకాణి గోవర్ధన్‌రెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు. సచివాలయంలోని రెండో బ్లాక్‌లో కుటుంబ సభ్యులతో కలిసి పూజలు చేసిన అనంతరం మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. అనంతరం.. రూ. 1,395 కోట్లతో 3.75 లక్షల ఎకరాలకు మైక్రో ఇర్రిగేషన్ అవకాశం కల్పించే ఫైల్‌పై మొదటి సంతకం చేశారు. 3,500 ట్రాక్టర్లని వైఎస్సార్ యంత్ర పథకం కింద ఇచ్చే ఫైల్‌పై రెండో సంతకం చేశారు. ఈ సందర్భంగా మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. 'వ్యవసాయ మంత్రిగా నాకు అవకాశం ఇచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు. ఈ ఆర్థిక సంవత్సరంలో రూ. 43 వేల కోట్లు



వ్యవసాయ అనుబంధ రంగాలకు కేటాయించాం. సీఎం జగన్ రైతు పక్షపాతి. రూ. 20 వేల కోట్లకు పైగా రైతు భరోసా కింద ఇప్పటివరకూ నగదు బదిలీ చేశాం. గన్నవరలో స్టేట్ సీడ్స్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ సెంటర్ ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకున్నాం. ఆర్బీకేల ద్వారా రైతుల అవసరాలు తీర్చేలా పీఏసీ ఖాతాలకు అనుసంధానం చేయాలని నిర్ణయించాం. రైతుల నగదు లావాదేవీలు కూడా ఆర్బీకేలలో జరిగేలా చర్యలు చేపట్టాం. రైతుల ఆకాంక్షలకు అనుగుణంగా పని చేస్తానని' ఈ సందర్భంగా మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు.

# సంపాదకీయం

శుక్రవారం ,22-04-2022

## మళ్లీ మాస్క్...

కరోనా ఫోర్త్ వేవ్ వస్తుందా? రాదా? అన్న విషయాన్ని గట్టిగా ఎవరూ చెప్పలేకపోతున్నారు. జులైలో ప్రమాదం పొంచి ఉందని ఇప్పటికే కొందరు హెచ్చరించారు. ప్రభుత్వాలు కూడా అప్రమత్తమయ్యాయి. ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాయి. నాలుగో తరంగాన్ని అడ్డుకునేందుకు కోవిడ్ నిబంధనలను మళ్లీ అమలు చేయాలనే ఆలోచనతో ఉన్నాయి. వచ్చే నెలలో కోవిడ్ పాజిటివ్ కేసుల సంఖ్య పెరగవచ్చని, అంత మాత్రానా ఫోర్త్ వేవ్ కచ్చితంగా వస్తుందని చెప్పలేమని అంటున్నారు గాంధీ ఆసుపత్రి సూపరింటెండెంట్ రాజారావు. అయితే కరోనా వైరస్ పీడ మాత్రం ఇంకా పూర్తిగా తొలగిపోలేదంటున్నారు. ఇప్పుడు ఉన్న డెల్టా, ఒమిక్రాన్, ఎక్స్ఈలు సబ్ వేరియంట్లే కాబట్టి వీటి ప్రభావం తక్కువగా ఉంటుందని చెబుతూనే కరోనా కొత్త వేరియంట్లతో మాత్రం జాగ్రత్తగా ఉండాలని సూచిస్తున్నారు. రెండేళ్ల కిందట చైనాలో పుట్టిన కరోనా వైరస్ ఇంత బీభత్సాన్ని సృష్టిస్తుందని అనుకోలేదు. చైనాకే పరిమితం అవుతుందని అనుకున్నారు కానీ ఆ వైరస్ ప్రపంచమంతటా వ్యాపించింది. ఇంచుమించు 62 లక్షల మంది ఉసురు తీసుకుంది. ఎంతోమందిని అనారోగ్యానికి గురి చేసింది. కరోనా నుంచి ఎలాగోలా కోలుకున్నవారిని కూడా ముప్పుతిప్పలు పెడుతోంది. మన దేశంలో కూడా ఎంతో మంది కరోనా బారిన పడి ప్రాణాలు కోల్పోయారు. ఎన్నో కుటుంబాలు చిన్నాభిన్నమయ్యాయి. చాలా దేశాలు ఆర్థికంగా కుదేలయ్యాయి. మనలో రోగ నిరోధక శక్తి పెంచేందుకు వాక్సిన్లను రూపొందించారే తప్ప కరోనాను అంతం చేసే మందులింకా మనుగడలోకి రాలేదు. అందుకే కరోనా మనల్ని వదలడం లేదు. ఎప్పటికప్పుడు కొత్త రూపాలను సంతరించుకుంటూ మనల్ని బాధపెడుతూనే ఉంది. మొన్నామధ్య డెల్టా రూపంలో విరుచుకుపడిన కరోనా ఆ తర్వాత ఒమిక్రాన్‌గా విరుచుకుపడింది. ఇప్పుడు దాని సబ్ వేరియంట్లైన బీఏ1, బీఏ2, ఎక్స్ఈలు వ్యాప్తి చెందుతున్నాయి. ఇప్పటికే ఢిల్లీలో తమ ప్రతాపాన్ని చూపుతున్నాయి. బీఏ.2 చైనాలో ఇప్పుడు స్వైర విహారం చేస్తున్నది. దీన్ని కట్టడి చేసేందుకు చైనా ప్రభుత్వం కఠిన ఆంక్షలను విధించింది. మరోసారి లాక్‌డౌన్ తప్పలేదక్కడ. జనజీవితం అస్తవ్యస్తమయ్యింది., షాంఘై నగరంలో అయితే ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. క్వారంటైన్ కేంద్రాలు నరకానికి నకళ్లుగా మారాయి. ఆకలితో ప్రజలు అలమటిస్తున్నారు. ఆసుపత్రులు కిటకిటలాడుతున్నాయి.దేశవ్యాప్తంగా గత కొన్ని రోజులు తగ్గుముఖం పడుతున్నకరోనా కేసులు? గత రెండు మూడు రోజుల నుంచి క్రమంగా పెరుగుతున్న సూచనలు కనిపిస్తున్నాయి. దేశ వ్యాప్తంగా ఈ ఒక్క రోజే 2 వేలకు పైగా కేసులు నమోదు అయ్యాయి. ఇదిలా ఉంటే కొన్ని రాష్ట్రాల్లో కరోనా కేసులు పెరుగుతున్నాయి. హర్యానా, ఢిల్లీల్లో కేసుల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. ఇదిలా ఉంటే పెరుగుతున్న కేసుల నేపథ్యంలో కేంద్రం అలెర్ట్ అయింది. హర్యానా, ఢిల్లీతో పాటు మహారాష్ట్ర, ఉత్తర్ ప్రదేశ్, మిజోరాం రాష్ట్రాలకు లేక రాసింది. పెరుగుతున్న కేసుల నేపథ్యంలో కరోనా వ్యాప్తిని తగ్గించడానికి కఠిన చర్యలు తీసుకోవాలని సూచించింది. వ్యాక్సినేషన్ వేగవంత చేయాలని సూచించింది.ఇదిలా ఉంటే కరోనా కేసులు పెరుగుతున్న క్రమంలో ఢిల్లీ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇప్పటికే ఢిల్లీలోని పలు స్కూళ్లలో కరోనా కేసులు నమోదయ్యాయి. దీంతో బహిరంగ ప్రదేశాల్లో ఖచ్చితంగా మాస్క్ ధరించాలని ఢిల్లీ డిజాస్టర్ మేనేజ్మెంట్ అథారిటీ( డీడీఎంఏ) ఆదేశాలు జారీ చేసింది. మరోవైపు మాస్క్ ధరించకపోతే రూ. 500 వరకు ఫైన్ వేసే అవకాశం కనిపిస్తోంది.మొన్నటి వరకు కరోనా పూర్తిగా కట్టడిలోకి వచ్చిందనుకున్నాం. ఇక ఏం ఫర్వాలేదని సంబరపడ్డాం. కాని కేసులు క్రమక్రమంగా పెరుగుతుండటం ఆందోళన కలిగిస్తోంది. దేశ రాజధాని ఢిల్లీలో అయితే కరోనా వైరస్ భయాందోళనలను రేపుతోంది. మళ్లీ జనం మొహంలో మాస్కులు వచ్చాయి. ఉత్తరప్రదేశ్, హర్యానాలో మాస్కులు పెట్టుకోవడం కంపల్సరీ అయ్యింది. కరోనా తగ్గిపోయిందన్న భావనతో కోవిడ్ నిబంధనలను పాటించకపోవడం వల్లే పరిస్థితి మళ్లీ మొదటికి వచ్చిందని వైద్య నిపుణులు అంటున్నారు. జనం గుంపులు గుంపులుగా తిరగడం మొదలుపెట్టారు. సామూహికంగా ఉత్సవాలు చేసుకుంటున్నారు. మాస్కులు పెట్టుకోవడం మానేశారు. అందుకే కరోనా మళ్లీ తన ప్రతాపాన్ని చూపిస్తోంది. కేరళ, మిజోరం, మహారాష్ట్ర, ఢిల్లీ, హర్యానాలలో పాజిటివిటీ రేటు పైపైకి వెళుతుండటం కలవరం కలిగిస్తోంది. ఇప్పటికే ఆయా రాష్ట్రాల ప్రభుత్వాలను కేంద్రం అలెర్ట్ చేసింది. జూన్ నెలలో కరోనా ఫోర్త్ వేవ్ వచ్చే అవకాశాలు ఉన్నాయని కొంతమంది పరిశోధకులు అంటున్నారు. ఫోర్త్ వేవ్ ఎలా ఉండబోతున్నదో ఇప్పుడు చెప్పడం కష్టం కాబట్టి మన జాగ్రత్తలో మనం ఉండటం మేలని సూచిస్తున్నారు. కోవిడ్ నిబంధనలను కచ్చితంగా పాటించాలని సలహా ఇస్తున్నారు. రెండు వేలకు పైగా కొత్త కేసులు నమోదయ్యాయంటే అప్రమత్తతతో వ్యవహరించాల్సిన సమయం వచ్చేసిందన్నట్టే! కరోనా నుంచి కోలుకున్నవారిలో చాలా మంది ఇంకా సఫర్ అవుతూనే ఉన్నారు. 30 శాతం మందిలో లాంగ్ కోవిడ్ లక్షణాలు కనిపిస్తున్నాయట. అలసట, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, వాసన లేకపోవడం వంటి లక్షణాలతో బాధపడుతున్నారు. ఇప్పటి వరకు మన దేశంలో నాలుగున్నర కోట్ల మంది కరోనా వైరస్ బారిన పడ్డారు. అయిదున్నర లక్షల మంది కరోనా కాటుకు బలయ్యారు. కోవిడ్ నుంచి కోలుకున్న ప్రతీ అయిదుగురిలో ఒకరు ఇతర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారు.

# రావెల పక్క చూపులు



గుంటూరు, ఏప్రిల్ 21, రాజకీయాల్లో ఒక్కసారి రాంగ్ స్టెప్ వేస్తే ఇక అంతే. భవిష్యత్ వెతుక్కున్నా కనపడదు. మాజీ మంత్రి రావెల కిషోర్ బాబు పరిస్థితి అలాగే ఉంది. పార్టీలు వరసగా మారినా ఆయనకు రాజకీయ భవిష్యత్ కనుచూపు మేరలో కన్పించడం లేదు. ప్రత్తిపాడు నియోజకవర్గం నుంచి కాకుండా మరో నియోజకవర్గానికి రావెల కిషోర్ బాబు మారాలనుకున్నా పరిస్థితులు అందుకు అనుకూలంగా లేవంటున్నారు. మాజీ మంత్రి, బీజేపీ నేత రావెల కిషోర్‌బాబు తిరిగి టీడీపీ గూటికి చేరతారనే వార్తలు వినిపిస్తున్నాయి. గుంటూరులో మంగళవారం నాడు టీడీపీ అధినేత చంద్రబాబును రావెల కిషోర్‌బాబు కలిసి మంతనాలు జరిపారు. దీంతో ఆయన టీడీపీలో చేరడం ఖాయమని తెలుస్తోంది. 2019 సార్వత్రిక ఎన్నికల్లో జనసేన తరపున పోటీ చేసి రావెల ఓటమి పాలయ్యారు. ఎన్నికల తర్వాత రావెల జనసేనకు గుడ్‌బై చెప్పి బీజేపీలో చేరారు. అయితే కొంతకాలంగా ఆయన మళ్లీ టీడీపీలో చేరతారంటూ ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో తాజాగా చంద్రబాబును రావెల కలవడంతో ఈ వార్తలకు బలం చేకూరింది. గతంలో రావెల కిషోర్ బాబు ఐఆర్ఎస్ అధికారిగా పనిచేశారు. 2014 ఎన్నికలకు ముందు టీడీపీలో చేరారు. గుంటూరు జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం నుంచి టీడీపీ టికెట్ దక్కించుకున్నారు. ఎమ్మెల్యేగా గెలవడంతో అనూహ్యంగా మంత్రి పదవి కూడా దక్కింది. సాంఘిక, గిరిజన సంక్షేమ శాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వహించారు. అయితే వరుస వివాదాల కారణంగా 2018లో కేబినెట్ విస్తరణలో ఆయన మంత్రి పదవి పోయింది. దీంతో అసంతృప్తి చెందిన ఆయన.. టీడీపీకి రాజీనామా చేసి జనసేన పార్టీలో చేరారు. 2019 ఎన్నికల్లో జనసేన పార్టీ తరఫున పోటీ చేసిన సంగతి తెలిసిందే.కిశోర్ బాబు మాజీ ఐఆర్ఎస్ అధికారి. రాజకీయాల్లోకి వచ్చిరాగానే తెలుగుదేశం పార్టీలో చేరి ప్రత్తిపాడు ఎమ్మెల్యేగా గెలిచారు. వెనువెంటనే సామాజికవర్గం కోణంలో మంత్రి పదవిని దక్కించుకున్నారు. అంతా సాఫీగా సాగిపోతుందనుకున్న సమయంలో నియోజకవర్గంలోని ఒక సామాజికవర్గం తనను డామినేట్ చేయడం ఆయన సహించలేకపోయారు. వారికి ఎదురు తిరిగారు. ఫలితంగా మంత్రిపదవి ఊడిపోయింది.టీడీపీ నుంచి వైసీపీలోకి వెళ్లాలనుకున్నా అక్కడ అవకాశాలు లేకపోవడంతో జనసేనలో చేరారు. ఆ పార్టీ నుంచి పోటీ చేసి దారుణ ఓటమిని చవిచూశారు. 2019 ఎన్నికల అనంతరం జనసేనను వీడి భారతీయ జనతా పార్టీలో చేరారు. రావెల కిషోర్ బాబు చేరిన తర్వాత జనసేన పార్టీ బీజేపీతో పొత్తు పెట్టుకుంది. దీంతో జనసేన, బీజేపీ కూటమి నుంచి ప్రత్తిపాడు నియోజకవర్గం నుంచి పోటీ చేసినా ఫలితం ఉండదు. అక్కడ టీడీపీ, వైసీపీ బలంగా ఉండటంతో మరోసారి ఎమ్మెల్యే అయ్యే ఛాన్స్ ఉండదని రావెల కిషోర్ బాబు భావిస్తున్నారు.మరో రిజర్వ్ నియజకవర్గం కోసం ఆయన వెతుకులాట ప్రారంభించినట్లు తెలిసింది. తిరిగి టీడీపీలో చేరడమా? లేక వైసీపీలో చేరి మరో రిజర్వ్ నియోజకవర్గం నుంచి పోటీ చేయడమా? అన్న ఆలోచనలో రావెల కిషోర్ బాబు ఉన్నట్లు తెలుస్తోంది. ఇటీవల సన్నిహితులతో జరిగిన సమావేశంలో వైసీపీలో చేరితేనే రాజకీయ భవిష్యత్ ఉంటుందని ఎక్కువ మంది అభిప్రాయపడినట్లు తెలిసింది. మొత్తం మీద మాజీ మంత్రి రావెల కిషోర్ బాబు త్వరలోనే కీలక నిర్ణయం తీసుకోనున్నారు.

# విడదల రజనీకి బాధ్యతల వెనుక

విశాఖపట్టణం, ఏప్రిల్ 21, (న్యూస్ పల్స్)విశాఖ జిల్లా. మొదటి నుంచీ జగన్ రాజకీయం వైజాగ్ చుట్టూనే తిరుగుతోంది. విశాఖను ఏకంగా ఎగ్జిక్యూటివ్ కేపిటలే చేయాలనుకున్నారు. గతంలో తల్లి విజయమ్మను సైతం విశాఖ నుంచే పోటీ చేయించి.. ఓడిపోయి పరువంతా పోగొట్టుకున్నారు. ఆ తర్వాత విజయసాయిని వైజాగ్‌కు ఫిక్స్ చేసి.. ఆ ప్రాంతంపై స్పెషల్ ఫోకస్ పెట్టారు. ఆయన మాత్రం అవినీతి, కబ్జాలు, అరాచకాలతో విశాఖను ఆగమాగం చేశారు. పార్టీని పూర్తిగా డ్యామేజ్ చేశారు. అలా, సాయిరెడ్డి చేతిలో చితికిపోయిన విశాఖలో వైసీపీని మళ్లీ పూర్వవైభవం దిశగా నడిపించే కీలక బాధ్యతలను కొత్త మంత్రి విడదల రజనీకి అప్పగించడం ఆసక్తికరంగా మారింది. ఎంతోమంది సీనియర్లు ఉండగా.. విశాఖ జిల్లా వైసీపీని రజనీ చేతిలో పెట్టడం వెనుక జగన్ వ్యూహం ఏమై ఉంటుందా అనే చర్చ జరుగుతోంది. రజనీ. జస్ట్ ఫస్ట్ టైమ్ ఎమ్మెల్యే. పెద్దగా రాజకీయ అనుభవం కూడా లేదు. అలాంటి రజనీని.. ఎక్కడో చిలకలూరిపేట నుంచి తీసుకొచ్చి.. విశాఖ పగ్గాలు అప్పగించడం వెనుక జగన్ లెక్క వేరే ఉందని అంటున్నారు. ఆమె తొలిసారి ఎమ్మెల్యేనే అయినా.. మంత్రి పదవి వరకూ ఈజీగా ఎదగడం చూస్తుంటే రజనీ.. జబర్దస్త్ లీడర్ అని తెలిసిపోతోందిగా. చంద్రబాబును నాటిన మొక్క నంటూ రాజకీయాల్లోకి వచ్చి.. టీడీపీకి హ్యాండిచ్చి.. వైసీపీలోకి దూకి.. మర్రి రాజశేఖర్‌కు చెక్‌పెట్టి.. ఎమ్మెల్యేగా గెలిచి.. మూడేళ్లలోనే మంత్రి పదవి దక్కించుకోవడం మామూలు విషయమేమీ కాదు. ఆమె రాజకీయ చాతుర్యానికి మెచ్చే జగనన్న.. విశాఖ జిల్లాను విడదల చేతిలో పెట్టారని అంటున్నారు. సోషల్ మీడియాను మేనేజ్ చేయడంలో రజనీ ఎక్స్‌పర్ట్. ఆకట్టుకునే కట్టు, బొట్టుతో.. ఆకర్షించే ప్రసంగాలతో.. ప్రజల అటెన్షన్ తనవైపే ఉండేలా చేయడం బాగా వంటబట్టించుకున్నారని చెబుతారు. ఎప్పటికప్పుడు సోషల్ మీడియాలో తన ఫోటోలు, ప్రసంగాలు, కార్యక్రమాలు అప్‌డేట్ చేస్తూ.. ప్రత్యేకంగా ప్రమోషన్ టీమ్‌ను పెట్టుకొని.. తనేదో హంగామా చేస్తున్నట్టు సీన్ క్రియేట్ చేస్తూ.. నిత్యం న్యూస్‌లో ఉంటూ.. ప్రజల నోళ్లలో తన పేరు వినిపించేలా.. తన గురించి చర్చ జరిగేలా చేస్తుంటారని అంటారు. ఈ రోజుల్లో ఇలాంటి మీడియా ప్రమోషనే కదా కావాల్సింది. ఆ టాక్టిస్ విశాఖ జిల్లాలో బాగా వర్కవుట్ అవుతుందనేది జగన్ అంచనా. విశాఖ నగరంలో యువత, చదువుకున్నవారు, సోషల్ మీడియా ఫాలోవర్స్ ఎక్కువ. అర్బన్ కల్చర్ పీపుల్ విడదల రజనీ వంటి వారు ఈజీగా అట్రాక్ట్ అవుతారు. అలా, విశాఖలో రజనీ మేనియాని ఓట్ల రూపంలో మార్చుకోవడం సులువు. అందుకే, పార్టీలో ఎంతమంది సీనియర్లు ఉన్నా.. వారందరినీ కాదని విడదల రజనీని విశాఖ జిల్లా వైసీపీ ఇంఛార్జిగా నియమించారని అంటున్నారు.

# వైసీపీలో రీజనల్ జ్వాల

గుంటూరు, ఏప్రిల్ 21,కొత్త రీజనల్ కో ఆర్డినేటర్లు వచ్చినంతనే వైసీపీలో పాత విభేదాలు అంత సులువుగా తొలగిపోవు కానీ కొన్నింటికి పరిష్కారం దొరుకుతుంది అన్న ఆశతో ఉన్నారు అక్కడి నాయకులు. ఇక్కడ నెలకొన్న పరిణామాలను చక్కదిద్దే బాధ్యతలు వైసీపీ పెద్దలు అందుకుంటే చాలు తరువాత పార్టీ మరింత బలోపేతం కావడం సాధ్యమేనన్న భావనతో కొందరు ఉన్నారు. పార్టీని మరోవైపు ప్రభుత్వాన్ని ఏక కాలంలో సంస్కరించిన జగన్ కు పల్నాడు సమస్యలు కొన్ని కొత్త తలనొప్పులే తీసుకురానున్నాయి. వాటిపై ఆయన దృష్టి నిలపకపోతే సౌమ్యతకు నెలవు అయిన ఆ ఎంపీ పార్టీని వీడి తన దారి తాను చూసుకోవడం ఖాయమని తెలుస్తోంది. ఆ వివరం ఈ కథనంలో?.పల్నాటి సీమలో విభేదాలు వెలుగులోకి వస్తున్నాయి. ఇక్కడి వైసీపీలో అంతర్యుద్ధమే కొనసాగుతుంది అన్న వాదన ఒకటి వినిపిస్తోంది. ముఖ్యంగా నరసరావుపేట ఎంపీ కృష్ణదేవరాయులు పార్టీ కార్యక్రమాలకు దూరంగానే ఉంటున్నారు అన్న వాదన కూడా వినవస్తోంది. గత కొంత కాలంగా ఆయనకు, మిగతా ఎమ్మెల్యేలకూ మధ్య దూరం బాగానే పెరిగిందని తెలుస్తోంది.ఈ కారణంగా ఆయన పార్టీ మారనున్నారు అన్న సంకేతాలు కూడా వస్తున్నాయి.ముఖ్యంగా జిల్లాల ఏర్పాటు విషయమై కూడా ఆయన అసంతృప్తితోనే ఉన్నారని తెలుస్తోంది. నరసరావుపేట కేంద్రంగా పల్నాడు జిల్లాను అనౌన్స్ చేసినప్పటికీ సంబంధిత ప్రతిపాదనలు ఏవీ బాగాలేవని ఎంపీ అంటున్నారు. దీంతో పాటు పార్టీ అధిష్టానంకు ఏం చెప్పినా కూడా వినిపించుకోవడం లేదు అని కూడా ఆయన అసంతృప్తి వ్యక్తం చేస్తూ ఉన్నారు.గతంలో వినుకొండ ఎమ్మెల్యే బ్రహ్మనాయుడు తగాదాతో పార్టీ పరువు చాలానే పోయింది. ఓ రైతును చెప్పు కొట్టేందుకు వెళ్లారన్న అభియోగం తరువాత అదే రైతును అరెస్టు చేయించడం ఇవన్నీ కూడా ఆయనకు నచ్చలేదు అని కూడా తేలిపోయింది. దీంతో ఆయన పార్టీ కి గుడ్ బై చెబితే ఎలా ఉంటుంది అని కూడా ఆలోచిస్తున్నారు. అదేవిధంగా చిలకలూరిపేట ఎమ్మెల్యే విడదల రజనీ కి ఆయనకూ మధ్య విభేదాలు ఉన్నాయని కూడా సమాచారం. ఇవన్నీ ఓ ఎత్తయితే అధికారంలో ఉండి కూడా తన ఆఫీసు ముందరి రోడ్డు అస్తవ్యస్తంగా ఉన్నా కూడా భరించాల్సి వస్తుందని, కొత్త రోడ్డు వేయించుకునేందుకు కూడా వీలుగా లేదని, ఏమంటే అధికారులు నిధులు లేవనే అంటున్నారని ఆయన ఆవేదన చెందుతున్నారు. ఒక్కటి కాదు రెండు చాలా పరిణామాల నేపథ్యంలో ఆయన పార్టీ మారుతారు అన్న వార్తలు గుప్పు మంటున్నాయి. నిప్పు లేనిదే పొగరాదు.. ఒప్పుకోవాలి.,. ఎవరు ఈ జ్వాలను రగిలించారు.. ఎవరు దీనికి బలి కానున్నారు అన్నది ఇప్పుడొక హాట్ టాపిక్ .

# విజయవాడలో కాంగ్రెస్ మహాసభ జయప్రదంచేయండి

నీలి శ్రీనివాసరావు

కడప ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, శ్రామిక, పేదల హక్కుల రక్షణ కొరకుబుధవారం విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఆంధ్ర ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ నిర్వహించిన సమ్మేళనం జయప్రదం అయిందని, కాంగ్రెసు కడప పార్లమెంటు జిల్లా అధ్యక్షుడు నీలి శ్రీనివాసరావు తెలిపారు.ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లెం విజయ భాస్కర్ తో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. సమ్మేళనానికి ముఖ్య అతిథులుగా హాజరైన ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనారిటీ కమిటీల జాతీయ సమన్వయకర్త కొప్పుల రాజు, రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ సాకే శైలజానాథ్ లు మాట్లాడుతూ, బహుజనులకు రాజ్యాధికారం దిశగా కాంగ్రెస్ అడుగులు వేస్తోంది అన్నారని,డాక్టర్ అంబేద్కర్ రచింపబడిన రాజ్యాంగాన్ని రక్షించే బాధ్యత కాంగ్రెస్ తీసుకుంటుందన్నారని,బడుగు బలహీన పేద వర్గాల శ్రేయస్సు కోసం కాంగ్రెస్ ఎల్లప్పుడూ శ్రమిస్తుంది అన్నారని,1960 లోనే పేద దళితుడైన దామోదరం సంజీవయ్య ను ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కు ముఖ్యమంత్రిని చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీదే అని,ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాను తీసుకువచ్చి వారిలో ఆత్మస్థైర్యం నింపింది కాంగ్రెస్ అని,మైనార్టీలకు విద్య ఉద్యోగ రంగాలలో నాలుగు శాతం రిజర్వేషన్లు ఇచ్చిన ఘనత కాంగ్రెస్ ది అని,1968 లోనే బీసీ కమిషన్ ఏర్పాటు చేసింది కాంగ్రెస్ అన్నారు.1970లో బీసీలకు 25 శాతం

రిజర్వేషన్ కల్పించామన్నారు. 1994లో స్థానిక ప్రభుత్వలలో 34 శాతం రిజర్వేషన్ బీసీలకు కల్పించామన్నారు.బీసీ కళాశాల హాస్టల్ లు, స్కాలర్షిప్లు ,ఫీజు రియంబర్స్మెంట్ లు మొదలు పెట్టింది కాంగ్రెస్ అన్నారు.రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తులసిరెడ్డి మాట్లాడుతూ, 2024లో రాష్ట్రంలోనూ మరియు కేంద్రంలోనూ కాంగ్రెస్ అధికారంలోకి రావడమే మే లక్ష్యంగా పని చేయాలని పిలుపునిచ్చారు.కడప జిల్లా నుంచి భారీగా ఈ సమావేశానికి హాజరైన ప్రతి ఒక్కరికి నీలి శ్రీనివాసరావు ధన్యవాదాలు తెలియజేశారు.

# అనంతలో మండుతున్న సూరీడు




అనంతపురం, ఏప్రిల్ 21,అనంతపురం జిల్లాలో ప్రచండ భానుడు ఉగ్రరూపం దాల్చాడు. నిప్పులు కురిపిస్తున్నాడు. ఎండవేడి, ఉక్కపోతతో జనం విలవిల్లాడుతున్నారు. 15 రోజులుగా జిల్లాలోని పలు ప్రాంతాల్లో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. పగలు ఉక్కపోత, వడగాల్పులతో జనం తల్లడిల్లుతున్నారు. అర్ధరాత్రి దాటితే గానీ ఉక్కపోత తగ్గడం లేదు. ముఖ్యంగా కణేకల్లు, ఉరవకొండ, రాయదుర్గం ప్రాంతాల్లో ఎడారీకరణతో ఇసుక మేటలు వేయడంతో ఎండతీవ్రత అధికంగా ఉంటోంది.ఈ నెలలో గరిష్టంగా 44 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదవుతోంది. కనిష్టంగా 26 డిగ్రీలు నమోదవుతోంది. ఎండలకు పది రోజుల్లో 10 మందికి పైగా వడదెబ్బ బారిన పడి మృత్యువాత పడ్డారు. సోమవారం సైతం ఉష్ణోగ్రత 43 డిగ్రీలకు చేరింది. జిల్లాలోని శింగనమల, పామిడి, తాడిమర్రి, ఉరవకొండ, గుంతకల్లు, ధర్మవరం, రాయదుర్గం, అనంతపురం, గుత్తి, బుక్కరాయసముద్రం, గార్లదినె?న, నార్పల, పుట్లూరు, యల్లనూరు, పుట్టపర్తి, విడపనకల్లు, కంబదూరు, తాడిమర్రి, పెనుకొండలో కనిష్టంగా 40 నుంచి 44 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదవుతోంది. గత ఏడాది ఇదే సమయంలో ఉష్ణోగ్రతలు ఇంతగా లేవు. ఒక్క నిమిషం విద్యుత్ కోత పడినా భరించలేని పరిస్థితి తలెత్తింది. గ్రామీణ ప్రాంతాల్లో అప్రకటిత కోతలు మొదలయ్యాయి.వృద్ధులు, చంటిపిల్లలు, బాలింతలు, వ్యాధిగ్రస్తులు ఉక్కపోతకు తట్టుకోలేక పోతున్నారు. అత్యధిక ఉష్ణోగ్రతల వల్ల జ్వరాల బారిన పడుతున్నారు.

# జగన్ క్లాసుతో సింహపురి మారేనా

నెల్లూరు, ఏప్రిల్ 21, సింహపురి పొలిటికల్ పంచాయతీని ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి తేల్చేశారు. గంట సమయం పాటు ఇద్దరికీ క్లాస్ తీసుకున్నారు. సీనియర్లే ఇలా చేస్తే ఎలా ప్రశ్నించిన సీఎం జగన్ ప్రశ్నించారు. పార్టీ కోసం కలిసికట్టుగా పని చేయాలని.. ఏదైనా ఉంటే తనతోనే సంప్రదించాలని సూచించారు. నెల్లూరు జిల్లా వైసీపీ పంచాయితీ చేరింది. ముఖ్యమంత్రి కార్యాలయం బుధవారం తాజా, మాజీ మంత్రులు కాకాణి గోవర్ధన్ రెడ్డి, అనిల్ కుమార్ యాదవ్‌లనుసీఎం జగన్‌తో భేటీకి ఆహ్వానించింది. దీంతో బుధవారం మధ్యాహ్నం సీఎం జగన్మోహన్ రెడ్డితో అనిల్ కుమార్ యాదవ్ భేటీ అయ్యారు. మాజీ మంత్రి అనిల్‌తో భేటీ అనంతరం సీఎం క్యాంప్ కార్యాలయానికి వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి చేరుకుని.. జగన్‌తో ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. మొత్తానికి సీఎం జగన్మోహన్ రెడ్డి సమక్షంలోనే నెల్లూరు వైసీపీ నేతల పంచాయితీకి ఎండ్ కార్డ్ పడింది.అయితే.. సమావేశం అనంతరం మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ.. అనిల్‌కు తనకు మధ్య ఎక్కడా విభేదాలు లేవని తేల్చి చెప్పారు. తాము ఎక్కడా పోటా పోటీ సభలు నిర్వహించలేదన్నారు. పోటా పోటీ సభలు అనేవి మీడియా సృష్టి అంటూ కొట్టిపారేశారు. ప్రస్తుతం ఉన్న పరిస్థితులల్లో నిప్పు లేకుండానే పొగ వస్తుందన్నారు. నెల్లూరులో అంతా ఫ్రెండ్లీ వాతావరణం ఉందని చెప్పుకొచ్చారు. నీడనిచ్చే చెట్టునే నరుక్కునే మూర్ఖులం తాము కాదన్నారు. సీఎం జగన్ తిరిగి సీఎం కావడమే లక్ష్యంగా పనిచేస్తామన్నారు. తనకు అనిల్‌కు మధ్య ఎలాంటి గ్యాప్ లేదన్నారు. నెల్లూరులో ఎవరి ఫ్లెక్సీలను ఎవరూ చింపలేదన్నారు. ఇరువురూ సమన్వయంతో కలిసి పనిచేయాలని సీఎం జగన్ ఆదేశించారని.. పార్టీ అభివృద్ధి సంక్షేమం గురించే సీఎంతో మాట్లాడినట్లుగా వెల్లడించారు. ఇతర అంశాలు చర్చకు రాలేదన్నారు.కాగా, మంత్రి కాకాణి, ఆనం, వేంరెడ్డి వర్గాలకు వ్యతిరేకంగా అనిల్ యాదవ్ పనిచేస్తున్నారంటూ ఆయా వర్గాలు అధిష్టానానికి ఫిర్యాదు చేశాయి. అలాగే, తనకు వ్యతిరేకంగా పని చేస్తున్నారంటూ అనిల్ సైతం కంప్లైంట్ ఇచ్చారు. దీంతో మాజీ మంత్రి అనిల్ యాదవ్‌కు, కాకాణికి ముఖ్యమంత్రి నుంచి పిలుపు వచ్చింది. ఈ క్రమంలో బుధవారం మధ్యాహ్నం 3 గంటలకు సీఎం జగన్‌ను అనిల్ కుమార్ యాదవ్ ఈ సమావేశం జరిగింది.పరస్పరం ఆరోపణలు చేసుకున్న అనిల్, కాకాణిలపై సీఎం జగన్ ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. నెల్లూరు జిల్లాలో జరుగుతున్న పరిణామాలపై ముఖ్యమంత్రి అసంతృప్తి వ్యక్తం చేసినట్లు సమాచారం. ఈ క్రమంలో నెల్లూరు జిల్లా వైసీపీలో విభేదాలకు శుభం కార్డు పడుతుందో లేదో అన్నది ఆసక్తికరంగా మారింది.

# పాపం...మర్రిరాజశేఖర్

గుంటూరు, ఏప్రిల్ 21, మర్రి రాజశేఖర్. ఈ చిలకలూరిపేట మాజీ ఎమ్మెల్యే గురించి చాలా మందికి తెలిసే ఉంటుంది. జగనన్న చేతిలో పదే పదే మోస పోతున్న బాధితుడిగా ఆయనపై అందరికీ సానుభూతి కూడా ఉంది. ఒకటి రెండుసార్లు కాదు.. రజనీ కోసం జగన్‌రెడ్డి ఆయనకు పలుమార్లు హ్యాండ్ ఇచ్చారు. అనేక సార్లు మాటతప్పి, మడమ తిప్పారు. పదవులు ఇచ్చేందుకు ముందుకురాని జగనన్న.. పార్టీ పనుల్లో వాడుకోవడానికి మాత్రం మర్రి గుర్తుకొచ్చారని అంటున్నారు. తాజాగా ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల వైసీపీ సమన్వయ బాధ్యతలు ఆయనకు అప్పగించారు. విడదల రజనీ కోసం.. వైసీపీ నుంచి ఎమ్మెల్యే సీటు వదులుకుంటే.. ఎమ్మెల్సీ పదవి ఇచ్చి, మర్రి రాజశేఖర్‌ను మంత్రిగా చేస్తానని గత ఎన్నికలకు ముందు సీఎం జగన్ చిలకలూరిపేట నడిబొడ్డున నిలబడి హామీ ఇచ్చారు. ఆ ప్రాంతంలో బలమైన నాయకుడిగా, పార్టీకి మొదటినుంచీ దన్నుగా ఉన్న మర్రిని కాదని రజనీ వైపు జగన్ మొగ్గు చూపడం వెనుక పెద్ద మొత్తంలో డీల్ జరిగిందని కూడా అంటారు. అందుకే, ఆమె కోసమే.. ఎమ్మెల్సీ హామీతో మర్రి రాజశేఖర్‌ను పక్కన పెట్టేసి.. రజనీని ఎమ్మెల్యేను చేశారు. పోనీ.. ఇచ్చిన మాటైనా నిలబెట్టుకున్నారా అంటే అదీ లేదు. గత మూడేళ్లుగా.. పలుమార్లు, పదుల సంఖ్యలో ఎమ్మెల్సీలనైతే ఎంపిక చేశారు కానీ.. అందులో మర్రి రాజశేఖర్ పేరు మాత్రం ఉండేది కాదు. ఎమ్మెల్సీ ఎన్నికల పేరు వినిపించినప్పుడల్లా.. మర్రికి ఛాన్స్ ఇస్తారనే ప్రచారం జరిగేదు. రేసులో ఆయన అందరికంటే ముందుండేవారు. కానీ, ఇప్పటి వరకూ ఆయన ఎమ్మెల్సీ కాలేకపోయారు. ఇక మంత్రి ఎలా చేస్తారు? ఇచ్చిన హామీని తుంగలో తొక్కి.. మర్రికి ఇస్తానన్న మంత్రి పదవిని.. ఆయన ప్రత్యర్థి రజనీకి ఇచ్చి.. ఆమెను మినిస్టర్‌గా మరింత అందలం ఎక్కించారు. విశాఖ జిల్లా పార్టీ ఇంఛార్జిగానూ నియమించి మరింత ప్రాధాన్యం, ప్రమోషన్ కల్పించారు. కానీ, మర్రిని ఇంకా ఎమ్మెల్సీనే చేయలేదు జగన్‌రెడ్డి. బహుషా కమ్మ కావడమే ఆయనకు శాపంగా మారిందేమో అంటున్నారు.

# రికవరి సొమ్ము మాయం

ఒంగోలు, ఏప్రిల్ 21, ఏపీ సర్కార్ రోజువారీ వ్యవహారాల కోసం కూడా రూపాయి రూపాయి వెతుక్కునే పరిస్థితిలో ఉంది. అప్పు చేయకుండా ఒక్కరోజు కూడా గడిచే పరిస్థితి లేదంటూ విపక్షాలు విరుచుకుపడుతున్నాయి. అయితే వాటిని వేటినీ ఖాతరు చేయకుండా సాగుతున్న జగన్ ఉచితాల పందేరాలతో ముందుకు సాగుతూనే ఉన్నారు. మరి వీటన్నిటికీ సొమ్మెక్కడిదన్న సందేహాలు అందరిలోనూ ముప్పిరిగొంటున్నాయి. కానీ క్రమంక్రమంగా ఉచితాల పందేరానికి జగన్ మంత్రం ఏమిటన్నది వెల్లడౌతున్నది. పంచాయతీ నిధులు, విపత్తు నిర్వహణ నిధులు ఇలా ఒక టేమిటి కనిపించిన ప్రతి ఖాతా నుంచి సొమ్ము బొక్కేసి మరో సారి అధికారంలోకి రావడానికి పెట్టుబడిగా ఉచితాలను పందేరం చేస్తున్నారు. అయితే ప్రభుత్వఖాతాల నుంచి బదలాయింపులు సరిపోవడం లేదేమో ఆఖరికి చోరీ సొత్తుపై కూడా ఆయన చూపు పడింది. చోరీలు, దోపిడీలు జరిగినప్పుడు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేస్తారు. పోలీసులు దర్యాప్తు చేసి నిందితుల నుంచి చోరీ సొత్తు రికవర్ చేస్తారు. నిందితులను కోర్టులో ప్రవేశపెట్టి రికవరీ వవరాలను కోర్టుకు నవేదిస్తారు. విచారణ తరువాత సదరు సొత్తును సొంత దారులకు అందజేయమని కోర్టు ఆదేశాలు ఇచ్చిన తరువాత ఆ సొత్తును సొంత దారులకు అందజేస్తారు.

అయితే ఆంధ్రప్రదేశ్ లో మాత్రం ఆ పని జరగడం లేదు. కోర్టు ఆదేశాల తరువాత కూడా సదరు సొత్తు సొంత దారులకు చేరడం లేదు. ఎందుకా అని ఆరా తీస్తే .... ఔరా! అంటే ముక్కున వేలేసుకునేలంటిగ్గ్భ్రాంతికరమైన విషయం బయటపడింది. అదేమిటంటే చోరీ రికవరీ సొత్తును కూడా జగన్ సర్కార్ వదలడం లేదట. ఆసొమ్మునూ ప్రభుత్వ ఖజానాకు తరలించేసి పబ్బంగడుపుకుంటోందట. సొంత సొమ్ము ఖర్చు చేయాల్సి వస్తే సోమవారం ఒంటి పొద్దులుండి, మంది సొమ్ముతో మంగళవారం ముప్పొద్దులా తిన్నట్లు....తన అధికార యావతో జనం జనం సొమ్మును కూడా ఉచిత పథకాలకు వాడేస్తున్నారు. కోర్టుల్లో డిపాజిట్ల రూపంలో ఉండాల్సిన సొత్తును కూడా జగన్ సర్కార్ సొంత లాభం కోసం వాడేసుకుంటున్నది. సొంత లాభం కొంత మానుకుని పొరుగువాడికి సాయపడవోయ్ అన్నాడు మహాకవి గురజాడ .... జగన్ సర్కార్ దానిని కొద్దిగా మార్చుకుని పొరుగువాడి సొత్తైనా వాడేసుకుని సొంత లాభం చూసుకోవోయ్ అన్నట్లు వ్యవహరిస్తున్నది.

# తమ్ముళ్ల ప్రిపరేషన్స్ రెడీ

విజయవాడ, ఏప్రిల్ 21, తెలుగుదేశం అధినేత చంద్రబాబు నాయుడు పుట్టిన్రోజు. పండుగ రోజు.. పసుపు పార్టీ లోగిళ్లలో ఆనందోత్సాహాలు వెల్లువెత్తుతున్న రోజు కూడా ఆ రోజు రాజధాని విషయమై ఓ స్పష్టత ఇచ్చారు. అమరావతి నిర్మాణానికి ఎంతో శ్రమించారు. ఆయన ఆలోచనలకు అనుగుణంగా పెట్టుబడులు కూడా వచ్చాయి. తరువాత ఆయనపై ఉన్న కోపంతో ప్రస్తుత ప్రభుత్వం కొన్ని తప్పిదాలు చేసి వాటిని వెనక్కు మళ్లించిన సందర్భం కూడా ఉంది. టీడీపీని ఎదిరించే స్థాయిలో వైసీపీ ఉంది కానీ వైసీపీని పూర్తి స్థాయిలోనిలువరించేందుకు టీడీపీకి ఉన్న శక్తి అయితే చాలడం లేదు. ఆ నమ్మకాన్ని వమ్ము చేయక జిల్లా అభివృద్ధికి కృషి చేస్తున్నా. యువతని జాగృతం చేసే ఏకైక నేత చంద్రబాబే అని చెప్పేందుకు ఎన్నో ఉదాహరణలు ఉన్నాయి. ఎందరో నాయకులను కష్టకాలంలో ముందుండి నడిపారు. ఈ రోజు మేమంతా పదవుల్లో ఉన్నామంటే కారణం ఆయన మార్గదర్శకత్వం కీలకంగా నిలిచింది. అదేవిధంగా ఆ రోజు నుంచి ఈ రోజు వరకూ నా వెంటేతెలుగు యువత నడిచింది. యువత నిప్పులాంటి వారు.. వారిలో చైతన్యాన్ని నింపి ప్రతి ఇంటికీ ఓ మణిదీపంలా మార్చేశక్తి నాయకత్వానిదే..అటువంటి సమర్థ నాయకత్వం చంద్రబాబుతోనే సాధ్యం. పదవే ధ్యేయం గా పనిచేసే నేతల కన్నా రాష్ట్రం కోసం పనిచేసే నేతలను ఎన్నుకోండి..అని చెప్పారాయన. ఇప్పటికే పలు నియోజకవర్గాలకు బాధ్యులను నియమించారు కనుక వాళ్లే భవిష్యత్ కాలంలో అంటే 2024లో అభ్యర్థులు అని ప్రభావశీలకంగా ప్రొజెక్ట్ చేయడం నేర్చుకోవాలి. ఆ విషయం ముందు ప్రజల్లోకి వెళ్లాలి..శ్రేణుల్లోకి వెళ్లాలి..శ్రేణుల అంగీకారం పొందే విధంగా నాయకత్వం ఒప్పించడం కూడా నేర్చుకోవాలి. అసంతృప్తులు తాము గెలిచి పార్టీని గెలిపించడం అన్నది జరగని పని!కనుక అలాంటి వారిని దూరం పెడుతూ ఉండడం కూడా నేర్చుకోవాలి. కార్పొరేట్ లాబీయింగ్ అన్నది అన్ని పార్టీలలో కూడా ఉంది కనుక ఏది ఎంత వరకో అంత వరకే అన్న సత్యాన్ని పాటించడం కూడా అధినాయకత్వం నేర్చుకోవాలి. లేదంటే నారాయణ లాంటి నాయకులు పదవులు అనుభవించి పక్కకు తప్పుకోవడం ఖాయం.

# జగన్ కోసం బుల్లెట్ ప్రూఫ్ బస్సులు

విజయవాడ, ఏప్రిల్ 21, ఏపీ సీఎం జగన్ ఇక నుంచి జిల్లా పర్యటనలు చేయనున్నారు. సీఎం జగన్ జిల్లా పర్యటనలకు బుల్లెట్ ప్రూఫ్ బస్సులను సిద్ధం చేస్తోంది ప్రభుత్వం. సీఎం పర్యటనల నిమిత్తం బుల్లెట్ ప్రూఫ్ బస్సులను సిద్ధం చేయాల్సిందిగా ఆర్టీసీకి ఆదేశాలు అందాయి. దీంతో అధికారులు రంగంలోకి దిగారు. రెండు బుల్లెట్ ప్రూఫ్ వాహనాలుచ పాంట్రీ వాహనం కండిషన్ చెక్ చేశారు ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమల రావుగతంలో 2009, 2015 సంవత్సరాల్లో బుల్లెట్ ప్రూఫ్ వాహానాలను కొనుగోలు చేసిన ప్రభుత్వం. ఇప్పటి వరకు బుల్లెట్ ప్రూఫ్ బస్సులను వినియోగించలేదు సీఎం జగన్. అధికారంలోకి వచ్చి మూడేళ్ళు అవుతున్నా బుల్లెట్ ప్రూఫ్ వాహనాలు వాడకపోవడంతో ఇక నుంచి జగన్ చేసే పర్యటనల్లో అన్నీ బుల్లెట్ ప్రూఫ్ వాహనాలే వుండనున్నాయి. త్వరలో సీఎం జిల్లా పర్యటనలు ఉండే అవకాశం ఉండడంతో బుల్లెట్ ప్రూఫ్ బస్సులను సిద్ధం చేస్తోంది ఆర్టీసీ.c

# ఒంగోలు ఘటనపై ముఖ్యమంత్రి ఆగ్రహం

అమరావతి సీఎం కాన్వాయ్ కోసం తిరుమల వెళ్లే వాహనాన్ని లాక్కోవడంపై ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి సీరియస్ అయ్యారు. ఈ నెల 22న ముఖ్యమంత్రి పర్యటన కోసం భక్తుల వాహనాన్నిఒంగోలు ఆర్టీయే స్వాధీనం చేసుకున్న విషయం తెలిసిందే. దాంతో బాధిత పల్నాడు జిల్లాకు చెందిన కుటుంబం నడిరోడ్డుపై పడిగాపులు పడింది. ఈ ఘటనపై ముఖ్యమంత్రి ఆగ్రహం వ్యక్తం చేసారు. బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కాన్వాయ్ కోసం వాహనాల బలవంతపు స్వాధీనంపై విచారణ జరపాలని పోలీస్ ఉన్నతాధికారులకు ఆదేశించారు. పల్నాడు జిల్లా వినుకొండకు చెందిన వేముల శ్రీనివాస్ తన కుటుంబంతో కలిసి వేంకటేశ్వర స్వామి దర్శనం కోసం తిరుమలకు బయలుదేరారు. మార్గమధ్యంలో బుధవారం రాత్రి సమయంలో ఒంగోలులోని స్థానిక పాత మార్కెట్ సెంటరులో వాహనం నిలిపి టిఫిన్ చేస్తుండగా ఓ కానిస్టేబుల్ అక్కడికి వచ్చారు ఈ నెల 22న ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఒంగోలు పర్యటన నేపథ్యంలో.. కాన్వాయ్ కోసం వాహనంతో పాటు డ్రైవర్ను ఇవ్వాలని డిమాండ్ చేశారు. తాము కుటుంబంతో తిరుమల వెళ్తున్నామని చెప్పినా వినిపించుకోలేదు. కారుతో పాటు డ్రైవర్ను తీసుకుని ఆ కానిస్టేబుల్ వెళ్లిపోయాడు. బాధితుడు వేముల శ్రీనివాస్ మాట్లాడుతూ సీఎం కాన్వాయ్ కు వాహనాలు కావాలంటే స్థానికులను అడిగి తీసుకోవాలనీ, దూరప్రాం తాలకు ప్రయాణం చేస్తున్న వారి నుంచి, అందునా మొక్కులు తీర్చుకునేందుకు పుణ్యక్షేత్రాలకు వెళ్తున్న వారి వాహనాలు లాక్కుని రోడ్డుపాలు చేయడం ఏమిటని వాపోయారు.

# విధుల నుంచి తాసిల్దార్ శాశ్వత తొలగింపు

### ఉత్తర్వులు జారీచేసిన ప్రభుత్వం

### ప్రభుత్వ భూముల అక్రమ బదలాయింపు కారణం

బద్వేలు కడప జిల్లాలో ఒక తాసిల్దార్ పై ప్రభుత్వం వేటు వేసింది తాసిల్దార్ ను శాశ్వతంగా ఉద్యోగం నుంచి తొలగిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది ప్రస్తుతం వీరపునాయునిపల్లె తాసిల్దార్ గా ఆయన డిప్యూటేషన్ ఉన్నారు ఆ తాసిల్దారు పేరు ఈశ్వరయ్య మొన్నటి వరకు ఆయన బద్వేల్ నియోజకవర్గంలోని అట్లూరు మండలానికి తాసిల్దార్ గా పని చేశారు అప్పట్లోనే ఆయనపై పలు ఆరోపణలు వచ్చాయి ఆరోపణలకు తగ్గట్లుగానే ఆయన వ్యవహారం ఉండేది భూముల వ్యవహారంలో ఒక తాసిల్దార్ విధుల నుండి పూర్తిగా తొలగించడం రెవెన్యూ శాఖలో ఇదే మొదటిసారి అని ఆ శాఖ అధికారులే అంటున్నారు ఈశ్వరయ్య 2015 నుంచి 2017 వరకు అట్లూరు మండలానికి తాసిల్దార్ గా పని చేశారు ఆ సమయములో భూముల ఆక్రమణకు పాల్పడినట్లు అభియోగాలు రావడంతో అప్పటి జిల్లా కలెక్టర్ ఆయనను సస్పెండ్ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు తరువాత డిప్యూటీ కలెక్టర్ రోహిణి విచారణ అధికారిగా నియమించారు మండలంలో దాదాపు100 కోటి రూపాయలు విలువచేసే వందల ఎకరాల భూములు రికార్డులు తారుమారు చేసి ఆ భూములు రాజకీయ నేతలకు వారి అనుచరులకు సొంతం చేసేలా అక్రమాలకు పాల్పడినట్లు ఆరోపణలు ఆయనపై వచ్చాయి రాజకీయ నేతలకు అక్రమంగా ప్రభుత్వ భూములు కట్టబెట్టడం తో పాటు ఒక వీఆర్వో భార్య పేరుతో వందల ఎకరాల భూములు మళ్ళించారు ఈ నేపథ్యంలో విచారణ నివేదికను జిల్లా కలెక్టర్ కు సమర్పించారు నివేదికను జిల్లా కలెక్టర్ రాష్ట్ర ప్రభుత్వానికి పంపారు ఈ సమయములో తనకు కంప్యూటర్ పరిజ్ఞానం లేకపోవడంతో పొరపాటు జరిగిందని క్షమించాలని విచారణ సమయంలో తాసిల్దార్ ఈశ్వరయ్య అధికారులకు చెప్పడం జరిగింది ఈశ్వరయ్య సస్పెండ్ అయిన తర్వాత కొన్ని నెలలకు ఆయనను ఓబులవారిపల్లె మండలానికి తాసిల్దార్ గా నియమించారు ఆ తర్వాత కడప అర్బన్ మండలంలో రెండవ తాసిల్దార్ గా నియమించగా డిప్యుటేషన్పై రెండు నెలలుగా పని చేస్తున్నారు సుదీర్ఘ విచారణ అనంతరం ఆయనను నుండి శాశ్వతంగా తొలగిస్తూ సీసీఎల్ఏ జాయింట్ సెక్రెటరీ ఆదేశాలు జారీ చేశారు

# ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేస్తే ప్రజలు గుణపాఠం చెబుతారు

నంద్యాల నంద్యాల జిల్లా కేంద్రంలో గురువారం నాడు ఓ ప్రకటనలో బికె యమ్ యు రాష్ట్ర ప్రదాన కార్యదర్శి ఆవుల శేఖర్ మాట్లాడుతూ కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు కుట్ర చేస్తున్నారని విమర్శించారు. ఉపాధి హామీ చట్టానికి కేంద్ర బడ్జెట్ లో 2.40 కోట్లు కేటాయించాలని,ఉపాధి హామీ పనిలో రెండు పూటల పనిని రద్దు చేయాలని,ఉపాధి హామీ పనిలో పెండింగులో ఉన్న బకాయిలను తక్షణమే విడుదల చేయాలని కోరుతూ,ఉపాధి కూలీలకు 600 రూపాయలు కూలి ఇవ్వాలని,200 రోజులు పని కల్పించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో నంద్యాల ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి అనంతరం ఆర్డీఓ కార్యాలయంలో ఏవో హరనాథ్ రావు కు వినతిపత్రం ఇవ్వడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్ పాల్గొని ధర్నా ను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బాబఫక్రుద్దీన్, జిల్లా ఉపాధ్యక్షుడు సుబ్బారాయుడు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాగరాముడు,ఎఐ యస్ ఫ్ . జిల్లా అధ్యక్షుడు ధనుంజయుడు, జిల్లా ఉపాధ్యక్షుడు సురేష్, కార్యదర్శి సోమన్న గోస్పాడు కార్యదర్శి హరి, నాయకులు బాషా తదితరులు పాల్గొన్నారు.

# టీడీపీకి కార్యకర్తలే వెన్నెముక

పిఠాపురం తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలే వెన్నెముక అని,2024లో తెలుగుదేశంపార్టీ తిరిగి అధికారం చేపట్టడం ఖాయమని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి,పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్.వీ.ఎస్.ఎన్. వర్మ పేర్కొన్నారు. పిఠాపురం తెలుగుదేశంపార్టీ కార్యాలయంలో పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం మాజీ ఎమ్మెల్యే వర్మ ఆధ్వర్యంలో జరిగింది,ముందుగా తెలుగుదేశంపార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు పార్టీ కేంద్ర కార్యాలయం నుండి జూమ్ యాప్ ద్వారా సభ్యత్వ నమోదును ప్రారంభించారు,ఈ సందర్భంగా ఆన్ లైన్ ద్వారా తెలుగుదేశంపార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి,మాజీ ఎమ్మెల్యే వర్మ తన సభ్యత్వాన్ని నమోదు చేసుకున్నారు. అనంతరం పిఠాపురం నియోజకవర్గానికి సంబంధించిన సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని వర్మ ప్రారంభించారు. ఈ సందర్భంగా వర్మ మీడియాతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రెడ్డెం భాస్కరరావు,సఖుమళ్ళ గంగాధర్,అనిశెట్టి సత్యానందరెడ్డి,కొండేపూడి ప్రకాశ్,మడికి ప్రసాద్,నల్లా శ్రీను,పెద్దిరెడ్ల నందిబాబు,జ్యోతుల సతీశ్,జవ్వాది జోగేశ్వరరావు,బర్ల అప్పారావు,ఎలుబండి రాజారావు,అడ్డగర్ల శివ,దుడ్డు నాగు. బస్వా నాగసత్తులు,రావు మాధవరావు,శీరం భద్రరావు,నామా దొరబాబు,బొజ్జా సూరిబాబు .తదితరులు పాల్గొన్నారు

# భారీగా పెరగనున్న సిమెంట్ ధరలు



ముంబై, ఏప్రిల్ 21, రష్యా-ఉక్రెయిన్ యుద్ధం( కారణంగా నిత్యావసర వస్తువులు, ఇంధనం, మరెన్నో ఉత్పత్తుల ధరలు భారీగా పెరిగాయి. ఇప్పుడు ఇరు దేశాల మధ్య నెలకొన్న పరిస్థితులతో సిమెంట్ ధరలు కూడా భారీగా పెరిగే అవకాశం ఉన్నట్లు క్రిసిల్ సంస్థ వెల్లడించింది. ఇప్పటికే పలు సార్లు పెరిగిన సిమెంట్ ధరలు సామాన్యుల కలలను ఆవిరిచేశాయి. ఇదే తరుణంలో మరో సారి సిమెంట్ ధరలు పెరగనున్నట్లు తెలుస్తోంది. యుద్ధం కారణంగా.. బొగ్గు, పెట్ కోక్, ముడి చమురు ధరలు భారంగా మారటం వల్ల.. ఈ నెలలో సిమెంట్ బస్తా మరో రూ.25 నుంచి రూ.50 వరకు పెరిగే అవకాశముందని రేటింగ్ ఏజెన్సీ క్రిసిల్ వెల్లడించింది. సిమెంట్ తయారీలో వినియోగించే బొగ్గు, పెట్ కోక్ ధరలు గత ఆరు నెలల కాలంలో 30 శాతం నుంచి 50 శాతం వరకు పెరగటమే పెరుగుదలకు ప్రధాన కారణంగా నిలుస్తోందని క్రిసిల్ తెలిపింది. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం కారణంగా కీలక ముడిపదార్థాలైన బొగ్గు, పెట్ కోక్తో పాటు.. ముడి చమురు దిగుమతులు భారంగా మారాయి. ఈ ప్రభావం సిమెంట్ ధరలపై స్పష్టంగా కనిపిస్తోంది. వాస్తవానికి యుద్ధం కారణంగానే.. బొగ్గు, పెట్ కోక్ ధరలు గడిచిన ఆరు నెలల్లో 30-50 శాతం పెరిగాయి. గడిచిన ఏడాది కాలంలో దేశంలో ఒక్కో సిమెంట్ బస్తా ధర రూ.390కి పెరిగింది. పెరిగిన ఉత్పాదక వ్యయాన్ని వినియోగదారులపై సిమెంట్ కంపెనీలు వేస్తే.. ఈ నెలలో బస్తా సిమెంట్ రేటు మరో రూ.25-50 వరకు పెరిగే అవకాశం ఉంది. ఇంధనం, విద్యుత్, రవాణా ఛార్జీలు పెరగడంతో సిమెంట్ ధరలు క్రమంగా పెరుగుతున్నాయని దక్షిణ భారత సిమెంట్ తయారీదారుల సంఘం చెబుతోంది. ఆస్ట్రేలియాలో వాతావరణం అనుకూలించకపోవటం, ఇండోనేషియాలో నిషేధం వల్ల బొగ్గు ఎగుమతులు తగ్గడం వల్ల ధరల పెంపు అనివార్యమైనట్లు తెలుస్తోంది. అంతర్జాతీయ పెట్ కోక్ ధరలు మార్చి క్వార్టర్ లో 43 శాతం పెరిగాయి. గత ఆర్థిక సంవత్సరంలో అమెరికా పెట్ కోక్ ధర 96 శాతం పెరిగింది. దేశీయ పెట్ కోక్ ధరలు మార్చిలో 23 శాతం, ఏప్రిల్ నెలలో 21 శాతం మేర పెరిగాయి. సముద్ర రవాణా ఖర్చులు పెరగడం, సరఫరా వ్యవస్థల్లో ఇబ్బందుల కారణంగా పెట్ కోక్ దిగుమతి వ్యయం ఏడాది క్రితంతో పోల్చితే టన్నుకు 130 డాలర్ల మేర పెరిగింది. దేశంలోని ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాల్లో అఫోర్డబుల్ హౌసింగ్కు డిమాండ్ పెరగడం, మౌలిక వసతుల నిర్మాణానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తుండటంతో సిమెంట్ వినియోగం 5-7 శాతం పెరగవచ్చని క్రిసిల్ అంచనా వేసింది. దీనివల్ల ఇళ్లు నిర్మించాలనుకునే వారిపై భారీగా భారం పడనుంది.

# 2500 మందికి ఉపాధి

కాకినాడ, ఏప్రిల్ 21,తూర్పు గోదావరి జిల్లా బిక్కవోలు మండలం బలభద్రపురంలో గ్రాసిం ఇండస్ట్రీ కోర్ ఆల్కలీ యూనిట్ను బిర్లా గ్రూప్ ఛైర్మన్ కుమార మంగళం బిర్లాతో కలిసి సీఎం జగన్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రాసిమ్ పరిశ్రమ ద్వారా రాష్ట్రానికి రూ.2,700 కోట్లు పెట్టుబడులు వచ్చాయని వివరించారు. ఈ పరిశ్రమ ద్వారా ప్రత్యక్షంగా 1,300 మందికి, పరోక్షంగా 1,150 మందికి ఉపాధి లభిస్తుందని సీఎం జగన్ తెలిపారు. 75 శాతం స్థానికులకు ఉపాధి కల్పించేలా ఇప్పటికే రాష్ట్రంలో చట్టం చేసినట్లు ఆయన గుర్తుచేశారు. రాష్ట్రంలో భారీగా పెట్టుబడులు పెట్టేందుకు ఆదిత్య బిర్లా గ్రూప్ వంటి కంపెనీ ముందుకు రావడం శుభపరిణామం అని సీఎం జగన్ అభిప్రాయపడ్డారు. గ్రాసిమ్ పరిశ్రమ ఏర్పాటుపై బలభద్రపురం గ్రామస్తులు గతంలో ఆందోళన చెందారని.. కానీ ఈ పరిశ్రమలో టెక్నాలజీలో మార్పు ద్వారా జీరో లిక్విడ్ వేస్ట్ డిశ్చార్జ్ అవుతుందని జగన్ తెలిపారు. కలుషిత వ్యర్థాలు నేరుగా వదలకుండా జాగ్రత్తలు తీసుకున్నామని పేర్కొన్నారు. ప్రభుత్వం ఎన్నికలకు రెండు నెలల ముందు గ్రాసిమ్ సంస్థకు ఈ ప్రాజెక్ట్ అప్పగించిందని.. అయితే సమస్యలు పరిష్కారం కాకుండా సంతకాలు చేసిందని సీఎం జగన్ ఆరోపించారు. తమ ప్రభుత్వం వచ్చాక అన్ని సమస్యలు పరిష్కరించి కంపెనీ పనులు ముందుకు సాగేలా చేశామని జగన్ వెల్లడించారు. అవరోధాలను ఒక్కొక్కటిగా తొలగించి ప్రాజెక్టును నెలకొల్పామని తెలిపారు. కాగా గ్రాసిమ్ సంస్థ అందించే సీఎస్ఆర్ నిధులు స్థానికంగానే ఖర్చు చేస్తామని సీఎం జగన్ చెప్పారు. ఉద్యమకారులపై కేసులు ఎత్తివేతఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి కీలక నిర్ణయం తీసుకున్నారు.. తూర్పు గోదావరి జిల్లా పర్యటనలో ఉన్న ఆయన.. బిక్కవోలు మండలం బలభద్రపురంలో గ్రాసిం ఇండస్ట్రీ కోర్ ఆల్కలీ యూనిట్ను బిర్లా గ్రూప్ ఛైర్మన్ కుమార మంగళం బిర్లాతో కలిసి ప్రారంభించారు? అనంతరం కీలక ప్రకటన చేశారు.. 131 మంది ఉద్యమకారులపై కేసులు ఎత్తివేస్తున్నట్లు ప్రకటించారు సీఎం వైఎస్ జగన్.. గతంలో బలభద్రపురంలో కాలుష్య పరిశ్రమ వద్దంటూ కేపీఆర్ వ్యతిరేక ఉద్యమం జరిగింది.. ఈ సందర్భంగా 131 మందిపై కేసులు నమోదు చేశారు.. అయితే, ఇవాళ ఆ కేసులు ఎత్తివేస్తున్నట్టు వెల్లడించారు ఏపీ సీఎం? ఇక, ఉద్యమకారులపై కేసులు ఎత్తివేస్తూ జీ.వో. నంబర్ 321ను విడుదల చేశారు.. సంబంధిత జీవో కాపీని స్వయంగా ఎమ్మెల్యే సత్తి సూర్యనారాయణరెడ్డికి అందజేశారు ఏపీ సీఎం వైఎస్ జగన్.

# బెజవాడలో గ్యాంగ్ రేప్

విజయవాడ, ఏప్రిల్ 21,ఏపీలో విజయవాడలో దారుణం జరిగింది. ప్రభుత్వ ఆసుపత్రిలో ఓ మానసిక దివ్యాంగురాలిపై ముగ్గురు యువకులు సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. ప్రేమ పేరుతో యువతికి మాయమాటలు చెప్పి అత్యాచారం చేసినట్టు తెలుస్తోంది. ప్రభుత్వ ఆసుపత్రిలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగం చేస్తున్న ప్రియుడు శ్రీకాంత్.. మరో ఇద్దరితో కలిసి దారుణానికి పాల్పడ్డాడు. మూడు రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లిన యువతి తిరిగి రాలేదు. దీంతో యువతి తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే.. దీనిపై నున్న పీఎస్‌లో మిస్సింగ్ కేసు నమోదు కాగా.. నిన్న ప్రభుత్వ ఆసుపత్రిలో యువతిని గుర్తించారు పోలీసులు.

# స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణలో డ్రామాలాడుతున్న ప్రభుత్వాలు

విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు డ్రామాలాడుతున్నాయని స్టీల్ ప్లాంట్ , ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణ కమిటీ సభ్యులు సిహెచ్ నరసింహారావు అన్నారు. దేశంలో 56 శాతం మార్కె టింగ్ చేస్తున్న పరిశ్రమ స్టీల్ ప్లాంట్ మాత్రమేనని, అటువంటి స్టీల్ ప్లాంట్ పరిశ్రమ నష్టాలు వస్తున్నాయని ప్రైవే టుపరం చేస్తామని కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్ సాక్షిగా మాట్లాడుతోందని తెలిపారు. స్టీల్ ప్లాంట్, ప్రభుత్వ రంగ సంస్థల రక్షణకై విశాఖ జీవీఎంసీ గాంధీ విగ్రహం దీక్షా శిబిరం వద్ద సిపిఎం నేతలు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు నర్సింగ్ రావు మాట్లాడుతూ స్టీల్ ప్లాంట్ విషయంలో కేంద్ర ప్రభుత్వం తప్పుడు మాటలు మార్చుకోవాలని, రాష్ట్ర ప్రభుత్వం కూడా బిజెపి ప్రభుత్వానికి పరోక్షంగా సహకరిస్తోందని మండిపడ్డారు. ఈ విధానం మార్చుకోవాలని డిమాండ్ చేశారు.

# బాధ్యతలు స్వీకరించిన మంత్రి గుడివాడ అమర్ నాథ్

అమరావతి ఆంధ్రప్రదేశ్ పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రిగా గుడివాడ అమర్నాథ్ సచివాలయంలో బాధ్యతలు చేపట్టారు. ముందుగా ఆయన తన ఛాంబర్ లో ప్రత్యేక పూజలు అనంతరం భాద్యతలు స్వీకరించారు. అనంతరం రామాయప ట్నం పోర్టు నిర్వాసిత రైతులకు పరిహారం కోసం 8 కోట్ల రూపాయలను విడుదల చేసేలా తయారు చేసిన ప్రతిపాదనలపై మొదటి సంతకం చేసి ఆమోదం తెలిపారు. ఐటీ మంత్రిగా తనపై పెద్ద బాధ్యతను పెట్టారని,పెట్టుబడులు, పరిశ్రమల ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. 2వేల700 మందికి ఉద్యోగాలు కల్పించే గ్రాసిమ్ ఇండస్ట్రీస్ నేడు ప్రారంభిస్తున్నట్లు తెలిపారు.

# వివాహిత హత్యకేసులో ఇద్దరు అరెస్టు

నెల్లూరు నెల్లూరు జిల్లా కోవూరు మండలం వేగూరు గ్రామంలో ఈ నెల 16వ తేదీన జరిగిన మహిళ హత్య కేసును పోలీసులు ఛేదించారు. ఇద్దరు నిందితులను అరెస్టు చేసి, వీరి నుంచి హత్యకు ఉపయోగించిన స్కూటీ, కత్తిని స్వాధీనం చేసుకున్నారు. వేగూరు హరిజనవాడకు చెందిన చిన్నమ్మకు 24ఎళ్ల క్రితం శివయ్య అనే వ్యక్తితో వివాహమైంది. కొంత కాలం సజావుగా సాగిన వీరి కాపురంలో కలతలు రావడంతో, శివయ్య మాధురి అనే మహిళను రెండో వివాహం చేసుకున్నాడు. వీరికి వంశీ, నితీష్ అనే ఇద్దరు కుమారులున్నారు. అయితే గత కొంత కాలంగా శివయ్య మొదటి భార్య అయిన చినమ్మ వద్దకు వెళ్లి అక్కడే ఉంటున్నాడు. తండ్రి తమ ఇంటికి రాకపోవడానికి చిన్నమ్మే కారణమని కక్ష్య కట్టిన రెండో భార్య కుమారులు తల్లి వరసయ్యే మహిళను కత్తులతో పొడిచి కిరాతకంగా హతమార్చారు. కేసు నమోదు చేసిన పోలీసులు నిందితులు వంశీ, నితీష్ లను అరెస్ట్ చేశారు. ప్రణాళికాబద్ధంగానే వీరు మహిళను కిరాతకంగా హత్య చేశారని రూరల్ డీఎస్పీ హరనాథ్ రెడ్డి తెలిపారు. స్వల్ప వ్యవధిలోనే కేసు ఛేదించిన పోలీసులను ఆయన అభినందించారు.

# పదో తరగతి విద్యార్థి అదృశ్యం

గుంటూరు పదో తరగతి విద్యార్థి అదృశ్యం అయిన ఘటన మంగళగిరిలో జరిగింది. మంగళగిరి ప్రభుత్వ స్కూల్ లో చదువుతున్న ప్రకాష్ అనే విద్యార్థి బుధవారం నుంచి కనిపించకుండా పోయాడు. న్న ఉదయం స్కూలుకి వెళ్లి ఇంటికి తిరిగి రాలేదని తల్లిదండ్రులు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు..

# వేముల శ్రీనివాస్ కుటుంబంతో ఫోన్లో మాట్లాడిన నాదెండ్ల మనోహర్

విజయవాడ ప్రైవేటు వాహనంలో తిరుమల వెళ్తున్న ఓ కుటుంబాన్ని రాత్రి పూట నడిరోడ్డుపై ఉంచేసి ముఖ్యమంత్రి కాన్వాయ్ కోసం ఆ వాహనాన్ని ఆర్టీఏ అధికారులు తీసుకువెళ్లడం దుర్మార్గపు చర్య అని జనసేన రాజకీయ వ్యవహారాల కమిటీ ఛైర్మన్ నాదెండ్ల మనోహర్ స్పష్టం చేశారు. బుధవారం రాత్రి ఒంగోలు నగరంలో ఆర్టీఏ అధికారులు వినుకొండకు చెందిన వేమల శ్రీనివాస్ కుటుంబాన్ని ఇక్కట్లకు గురయ్యేలా ప్రవర్తించడాన్ని ఖండించారు. వేమల శ్రీనివాస్ కుటుంబంతో నాదెండ్ల మనోహర్ గురువారం ఉదయం ఫోన్లో మాట్లాడి పరామర్శించారు. ఈ సందర్భంగా వేమల శ్రీనివాస్ కుటుంబం తమకు ఎదురైన ఇబ్బందులను తెలియచేస్తూ తిరుమలకు వెళు తున్నాం.. పిల్లలు, మహిళలు ఉన్నారు అని చెప్పినా వినలేదు అని వాపోయారు. ముఖ్యమంత్రి కాన్వాయ్ కోసం ప్రజలను ఇబ్బందిపెట్టడం ఏమిటని ప్రశ్నిస్తూ... ఇదో కొత్త తరహా పాలనలా ఉందని నాదెండ్ల మనోహర్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

# శుక్రవారం ఒంగోలు లో సిఎం జగన్ పర్యటన

అమరావతిశుక్రవారం నాడు ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ఒంగోలులో పర్యటిస్తారు. వైఎస్సార్ సున్నావడ్డీ పథకం మూడో విడత పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. ఉదయం 9.30 గంటలకు తాడేపల్లి నివాసం నుంచి బయలుదేరి పీవీఆర్ మునిసిపల్ హైస్కూల్ గ్రౌండ్కు చేరుకుంటారు. అక్కడ జరిగే బహిరంగ సభలో ప్రసంగం అనంతరం వైఎస్సార్ సున్నావడ్డీ మూడో విడత పంపిణీ రాష్ట్రస్థాయి కార్యక్రమాన్ని ప్రారంభిస్తారు. కార్యక్రమం అనంతరం బందర్ రోడ్లోని రవిప్రియ మాల్ అధినేత కంది రవిశంకర్ నివాసానికి వెళ్ళి, వారి కుటుంబంలో ఇటీవల వివాహం అయిన నూతన వధూవరులను ఆశీర్వదిస్తారు. అక్కడి నుంచి బయలుదేరి మధ్యాహ్నం 1.45 గంటలకు తాడేపల్లి నివాసానికి చేరుకుంటారు.

# పార్టీలో కొందరు నేతల పనితీరుపై చంద్రబాబు హెచ్చరికలు

అమరావతి టీడీపీ కొందరు నేతల పనితీరు పై చంద్రబాబు మండిపడ్డారు. క్షేత్రస్థాయిలో పనిచేయకుండా మాయచేసే నేతలకు చెక్ పెడతాని హెచ్చరించారు. క్షేత్రస్థాయిలో పనిచేయకుండా పార్టీ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. పనిచేసే వారెవరో పర్యవేక్షించే వ్యవస్థ వచ్చింది. సీనియార్టీని గౌరవిస్తాం. సిన్సియార్టీని గుర్తిస్తాం. సీనియార్టీ ఉన్నా ఓట్లు వేయించలేని పరిస్థితి ఉంటే ఏం లాభమని అయన ప్రశ్నించారు. ఓట్లు వేయించలేని సీనియార్లకే ప్రాధాన్యమిస్తే ప్రతిపక్షంలోనే ఉంటాం. 40 శాతం యువతకు సీట్లిద్దామన్న పార్టీ నిర్ణయానికి కట్టుబడి ఉన్నాం. - తటస్తులనూ పార్టీలోకి ఆహ్వానిస్తున్నాం. పార్టీలో పనిచేసే యువ నేతలనూ గుర్తిస్తాం.. అవకాశాలిస్తామని అయన అన్నారు. సమాజ హితం కోసం టీడీపీ అవసరముంది. అందుకే విరాళాలు స్వీకరిస్తున్నాం. పార్టీకి విరాళాలు వస్తే కొంతమందికైనా సాయం చేయవచ్చని అయన అన్నారు.

# ఇందిరమ్మ కాలనీ ప్రజలకు అండగా ఉంటాం



**:- పాణ్యం, కర్నూలు ఎమ్మెల్యే లు,నగర మేయర్**

**నగరంలో అక్రమార్కుల ఆటలు సాగనియ్యం**

**అర్హులైన వారు గృహాలను ధైర్యంగా నిర్మించుకోవచ్చు**

**ఇందిరమ్మ కాలనీ గృహ లబ్ధిదారులతో సభ**

**హాజరైన మేయర్, పాణ్యం, కర్నూలు ఎమ్మెల్యేలు**

కర్నూలు ఏప్రిల్ 21( విభారె) :-కర్నూలు నగరంలోని, పాణ్యం నియోజకవర్గ పరిధిలోని కల్లూరు అర్బన్ 19 వ వార్డులోని ఇందిరమ్మ కాలనీలో అర్హులైన లబ్ధిదారులు గృహాలు నిర్మించుకునేందుకు అండగా ఉంటామని కర్నూలు నగర మేయర్ బి.వై. రామయ్య , పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి , కర్నూలు నగర ఎమ్మెల్యే ఎం.ఏ.హాఫీజ్ ఖాన్ పేర్కొన్నారు...2007వ సంవత్సరం క్రీ.శే. డా.వై.యస్. రాజశేఖరరెడ్డి హాయంలో కర్నూలు నగరంలో ఇళ్ళు లేని నిరుపేదల కోసం జోహరపురం సమీపంలో ప్రభుత్వ భూమితో పాటు ప్రైవేటు వ్యక్తుల వ్యవసాయ భూమిని కొనుగోలు చేసి ఇందిరమ్మ కాలనీని ఏర్పాటు చేశారు.అందులో 2412 కుటుంబాలకు ఇళ్ళ స్థలాలుగా చేసి అర్హులైన లబ్ధిదారులతో రూ.2100 నగదును డిపాజిట్ చేయించుకుని ప్రభుత్వం పట్టాలను పంపిణీ చేసింది.అనంతరం ఇళ్ళు నిర్మించుకోవడానికి పనులు ప్రారంభిస్తుండగా, ప్రైవేటు వ్యక్తుల నుంచి కొనుగోలు చేసిన భూమి యజమానులు, ప్రభుత్వం నుంచి సరైన పరిహారం చెల్లించలేదని పదేపదే లబ్ధిదారులు ఇళ్ళు నిర్మించుకోకుండా అడ్డుపడుతూ వచ్చారు.తర్వాత లబ్ధిదారులు కోర్టులకు వెళ్ళి అనుకూలంగా తీర్పు తెచ్చుకున్నారు.అయినప్పటికి యజమానులు అడ్డుకుంటడంతో లబ్ధిదారులు ఆ స్థలాలను అలాగే వదిలేశారు.దీన్ని ఆసరాగా తీసుకుని కొందరు కబ్జాదారులు స్థలాలతో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు...2021లో జరిగిన మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో ఈ సమస్యను మేయర్, ఎమ్మెల్యే కాటసాని దృష్టికి తీసుకురాగా ఎన్నికల అనంతరం పరిష్కారిస్తామని హామీనిచ్చారు.దీంట్లో భాగంగా గురువారం మేయర్,పాణ్యం,కర్నూలు నగర ఎమ్మెల్యేలు లబ్ధిదారులతో హౌసింగ్ అధికారులతో సభ ఏర్పాటు చేశారు...ఈ సందర్భంగా ఎమ్మెల్యే లు,మేయర్ మాట్లాడుతూ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటున్నామని, ఇళ్ళులు నిర్మించుకోకుండా మిగిలిన 623 మంది కచ్చితంగా ఇళ్ళులు ధైర్యంగా నిర్మించుకోవాలన్నారు.జిల్లా ఎస్పి దృష్టికి ఈ విషయం తీసుకెళ్ళి, పోలీసుల సహకారంతో కబ్జాదారుల మీద ఉక్కుపాదం మోపుతామన్నారు.నగరంలో అక్రమార్కుల ఆటలు సాగనియ్యమన్నారు.ఎవరికీ భయపడాల్సిన అవసరం లేదని అందరం అందుబాటులో ఉంటామని, త్వరగా ఇళ్ళులు పూర్తి చేసుకుంటే, ఘనంగా గృహ ప్రవేశాల కార్యక్రమాలను నిర్వహిద్దామని పిలుపునిచ్చారు...ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి కి సన్మానంఈ సభ ముగిసిన తర్వాత, ఇటివలే వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నంద్యాల జిల్లా అధ్యక్షులుగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చే నియమితులైన పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి ని మేయర్ బి.వై. రామయ్య , ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్ సన్మానించారు...ఈకార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు.. బెల్లం మహేశ్వర్ రెడ్డి, గోపాల్ రెడ్డి, శివరాం, యూనూస్, నారాయణమ్మ, డేవిడ్, స్రావన్, నాగరాజు, చిన్నా, శ్రీను తదితరులు పాల్గొన్నారు....

## కర్నూలుఐ ఎన్ టి యు సి లో పలువురు చేరిక

విజయవాడ/కర్నూలు ఏప్రిల్ 21:-కర్నూలు జిల్లాకు చెందిన కార్మిక కర్షకులు వందల మంది ఐ ఎన్ టి యు సి లో చేరారు. విజయవాడలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో చేరికలు జరిగాయి. పిసిసి చీఫ్ సమక్షంలో కార్మిక నాయకులు కార్యకర్తలు కండువా కప్పుకున్నారు. ఐఎన్ టి యుసి జిల్లా అధ్యక్షుడు బి బతుకన్న ఆధ్వర్యంలో పీసీసీ చీఫ్ శైలజనాథ్ సమక్షంలో దాదాపు 100 మంది కార్మిక కర్షకులు ఐ ఎన్ టి యు సి లో చేరారు. ఈ సందర్భంగా పీసీసీ మాట్లాడుతూ ఐ ఎన్ టి యు సి బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. కొత్తగా చేరిన వారిని ఉద్దేశించి మాట్లాడుతూ, స్వతంత్ర పోరాటంలో సైతం ఐ ఎన్ టి యు సి పోరాడిన చరిత్ర ఉందన్నారు.కార్మికులకు ఆయన వివరించారు. కార్మికులకు కార్మిక చట్టాలకు వెన్నెముకగా ఐఎన్ టియుసి ఉ ంటుందన్నారు. దానికి అనుగుణంగానే కాంగ్రెస్ పార్టీ గతంలో ప్రత్యేక చట్టాలు తీసుకోవడం కార్మికులకు వారి కుటుంబాలకు పలు సేవలు అందిస్తున్నారు. ఇందిరాగాంధీ ప్రధానమంత్రిగా ఉన్న సమయంలో కార్మికులకు సంక్షేమ పథకాలు అందించేందుకు అప్పట్లో అనేక జీవోలు అనేక చట్టాలు తీసుకొచ్చిన ఘనత ఇంద్ర గాంధీ కే దక్కుతుందన్నారు. ఆనాటి నుండి ఈనాటి వరకు కార్మిక కర్షకుల కోసం కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందన్నారు.

# సచివాలయ సిబ్బంది సకాలంలో విధులకు హాజరు కావాలిప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన సేవలు అందించాలి



**సచివాలయ సిబ్బందిని ఆదేశించిన కర్నూలు జిల్లా కలెక్టర్ పి. కోటేశ్వర రావు**

కర్నూలు , ఏప్రిల్ 21 ( విభారె) సచివాలయ సిబ్బంది సకాలంలో విధులకు హాజరు కావాలని,ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన సేవలు అందించాలని కర్నూలు జిల్లా కలెక్టర్ పి.కోటేశ్వర రావు సచివాలయ సిబ్బందిని ఆదేశించారుగురువారం కర్నూలు నగరంలోని నరసింగరావు పేట 1మరియు 2 వార్డు సచివాలయాలను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా సిబ్బంది హాజరు పట్టికలు, ఉద్యోగుల మూవ్మెంట్ రిజిస్టర్, సంక్షేమ పథకాల క్యాలెండర్, గడువులోగా ప్రజా సమస్యల పరిష్కార చర్యల నివేదిక తదితర రికార్డులను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ప్రజలకు అందించే సేవలను గడువు లోపు అందించాలని కలెక్టర్ ఆదేశించారు.. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు.. మొక్కుబడిగా కాకుండా చిత్త శుద్ధి తో ప్రజలకు సేవలందించాలని సూచించారు .ఫిర్యాదులు రాకుండా జాగ్రతగా పని చేయాలన్నారు..సచివాలయం ద్వారా రోజులో వీలైనన్ని ఎక్కువ సర్వీసులను సకాలంలో అందించాలన్నారు. సచివాలయ సిబ్బంది తాము సక్రమంగా పని చేయడంతో పాటు తమ పరిధి లో ఉన్న వాలంటరీ వ్యవస్థ కూడా సక్రమంగా పనిచేసేలా చొరవ చూపాలని కలెక్టర్ ఆదేశించారు . వన్టైమ్ సెటిల్మెంట్ కింద లబ్ధిదారులు అందరికీ డాక్యుమెంట్లను అందజేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. రేషన్ కార్డ్ లో సభ్యుల చేర్పు గురించిన దరఖాస్తులను పరిశీలించి సంబంధిత అధికారులతో మాట్లాడి వాటిని వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు..

## భారీగా సభ్యత్వాలు నమోదు చేయిస్తాం :- టిజి భరత్

కర్నూలు ఏప్రిల్ 21 :-భారీ సంఖ్యలో తెలుగుదేశం పార్టీ సభ్యత్వాలు నమోదు చేయిస్తామని కర్నూలు నియోజకవర్గ టీడీపీ ఇంచార్జి టిజి భరత్ అన్నారు. గురువారం తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభోత్సవంలో టిజి భరత్ పాల్గొన్నారు. పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు రాష్ట్ర వ్యాప్తంగా సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని జూమ్ ద్వారా ప్రారంభించారు. ఇందులో భాగంగా కర్నూల్ నియోజకవర్గం నుండి టిజి భరత్, ఐటీడీపీ నేతలు జూమ్ మీటింగ్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా టిజి భరత్ తన పార్టీ సభ్యత్వాన్ని రెన్యూవల్ చేసుకొని, పార్టీకి రూ. 25వేలు విరాళం అందజేశారు. ప్రతి ఒక్క టీడీపీ కార్యకర్త సభ్యత్వాన్ని రెన్యూవల్ చేసుకోవాలని పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరికి పార్టీ అండగా ఉంటుందని చెప్పారు. టిడిపిని క్షేత్ర స్థాయిలో బలంగా తీసుకువెళ్లేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఐటీడీపీ రాష్ట్ర నాయకులు చంద్రశేఖర్, కర్నూల్ పార్లమెంటరీ ప్రెసిడెంట్ తిలక్, కర్నూల్ అసెంబ్లీ ఇంచార్జి నిఖిల్, ప్రధాన కార్యదర్శి అశోక్, ఇతర ఐటీడీపీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.



# వార్డు వాలంటీర్లకు సేవా పురస్కారాలు అందజేసిన ఎమ్మెల్యే కాటసాని...!!!



కల్లూరు ఏప్రిల్ 21 :- పాణ్యం నియోజకవర్గ పరిధిలోని కల్లూరు మండలం పరిషత్ కార్యాలయంలో కల్లూరు మండలంలోని "వార్డు , గ్రామ వాలంటీర్లకు సేవా వజ్ర,సేవా రత్న, సేవా మిత్ర" అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం నిర్వహించారు...ఈ కార్యక్రమానికి పాణ్యం ఎమ్మెల్యే , టీటీడీ ధర్మకర్తల మండలి సభ్యులు కాటసాని రాంభూపాల్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు...ఈ సందర్భంగా ఎమ్మెల్యే వార్డు వాలంటీర్లనుద్దేశించి మాట్లాడుతూ...వాలంటీర్ల పనితీరు,ప్రజల్లో వాలంటీర్ల భాద్యత,వాళ్ళు చేసే సేవా కార్యక్రమాలను వివరిస్తూ వాలంటీర్లను అభినందించారు, అనంతరం వారికి ప్రశంసా పత్రాలు అందజేసి వారిని సన్మానించారు...ఈ కార్యక్రమంలో...కల్లూరు మండల సింగిల్ విండో ప్రెసిడెంట్ శివ శంకర్ రెడ్డి, ఓఖఖ శారదమ్మ,సల్కాపురం సర్పంచ్ మద్దిలేటి,26,28 వార్డు కార్పొరేటర్లు దండు లక్ష్మీకాంత్ రెడ్డి,నారాయణరెడ్డి,పూసులూరు రామకృష్ణ రెడ్డి,ఇంకా పలువురు ఓఖఅ లు,సర్పంచ్ లు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, వాలంటీర్లు,సంబంధిత అధికారులు పాల్గొన్నారు...


## పారిశుధ్య శాఖ కార్యాలయం ప్రారంభం

**ఈఈ కార్యాలయం భూమి పూజ**

**నంద్యాల ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి**

నంద్యాల నంద్యాల జిల్లా కేంద్రంలో గురువారం నాడు నంద్యాల శాసనసభ్యుడు శిల్ప రవి చంద్ర కిషోర్ రెడ్డి 32 లక్షలతో నిర్మించిన గ్రామీణ నీటి సరఫరా, పారిశుద్ధ్య శాఖ నూతన కార్యాలయాన్ని ప్రారంభించారు. అలాగే .నూతన భవన నిర్మాణానికి (ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్) కార్యాలయానికి 30 లక్షల వ్యయంతో నిర్మించేందుకు భూమి పూజ చేసారు. ఈ కార్యక్రమంలో పలువురు వైయస్సార్ కాంగ్రెసు పార్టీ కార్యకర్తలు అభిమానులు. ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు. .

# టాలీవుడ్ సినిమాకు 'కేజీఎఫ్ 2' బిగ్ షాక్



ఒక స్టార్ సినిమా వచ్చిందంటే ఆ సమయంలో చిన్న చిత్రాలు పోటీపడటానికి వెనకాడతాయి. పోటీలో నలబడేందుకు ఆసక్తిని చూపించవు. కానీ ఓ డబ్బింగ్ సినిమా కారణంగా టాలీవుడ్ లో ఇప్పుడు చిన్న చిత్రాలు రిలీజ్ డేట్ లు మార్చుకోవడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. కన్నడ రాకింగ్ స్టార్ యష్ నటించిన తాజా చిత్రం 'కేజీఎఫ్ చాప్టర్ 2'. ప్రశాంత్ నీల్ తెరకెక్కించిన ఈ చిత్రం డే వన్ నుంచి విడుదలైన అన్ని భాషల్లోనూ రికార్డులు సాధిస్తూ సంచలనాలు సృష్టిస్తోంది.తొలి రోజు ప్రారంభ వసూళ్ల పరంగా రికార్డు సాధించిన ఈ చిత్రం దంగల్ 2.ా బాహుబలి వంటి చిత్రాల ఐదు రోజుల కలెక్షన్స్ ని అధిగమించి సరికొత్త రికార్డు దశగా పయనిస్తోంది. అన్ని భాషల్లో కలిపి ఇప్పటి వరకు 450 కోట్లకు పై చిలుకే సాధించిందని ట్రేడ్ వర్గాలు చెబుతున్నా యి. ఇదిలా వుంటే ఉభయ తెలుగు తెలుగు రాష్ట్రాల బాక్సాఫీస్ వద్ద కేజీఎఫ్ 2 భారీ స్థాయిలో వసూళ్లని రాబడుతూ ఆసక్తిని రేకెత్తిస్తోంది. దీని తాకిడి కారణంగా రెండు మీడియం రేంజ్ చిత్రాలు రేసు నుంచి తప్పుకోవాల్సి వచ్చింది.విశ్వక్ సేన్ హీరోగా నటించిన తాజా చిత్రం 'అశోక వనంలో అర్జున కల్యాణం' నాగశౌర్య హీరోగా నటించిన 'కృష్ణ వ్రింద విహారి'. ఈ రెండు చిత్రాలని ఏప్రిల్ 22న విడుదల చేయాలని మేకర్స్ భావించారు. ఇందు కోసం రిలీజ్ ప్లాన్ లు కూడా చేసుకున్నారు. ప్రమోషన్స్ మొదలు పెట్టారు. సడన్ గా 'కేజీఎఫ్ 2' విడుదలై బ్లాక్ బస్టర్ గా మారడం.. ఇప్పటికీ థియేటర్లలో రికార్డు స్థాయిలో ఆకట్టుకుంటోంది. ఈ నేపథ్యంలో రాఖీభాయ్ కి ఎదురెళ్లడం ఇష్టం లేని ఈ హీరోలు తమ చిత్రాల రిలీజ్ లని వాయిదా వేసుకోవడం గమనార్హం.అంతే కాకుండా ఈ నెలాఖరులో అంటే ఏప్రిల్ 29న మెగాస్టార్ 'ఆచార్య' రిలీజ్ అవుతోంది. ఈ నేపథ్యంలో ఏప్రిల్ రిలీజ్ శ్రేయాస్కరం కాదని భావించిన యంగ్ హీరోస్ తమ చిత్రాలని వాయిదా వేసుకున్నారట. గత కొంత కాలంగా సక్సెస్ కోసం ఎదురుచూస్తున్న విశ్వక్ సేన్ నాగశౌర్య చాలా ప్రత్యేకతలతో రూపొందిన 'అశోక వనంలో అర్జున కల్యాణం' 'కృష్ణ వ్రింద విహారి' చిత్రాలలో నటించారు. 'అశోక వనంలో అర్జున కల్యాణం' చిత్రాన్ని కొత్త దర్శకుడు తెరకెక్కించారు. 'కృష్ణ వ్రింద విహారి' చిత్రాన్ని అనీష్ కృష్ణ రూపొందించాడు.ఈ రెండు చిత్రాలు హీరోలకే కాదు దర్శకులకు కూడా అత్యంత కీలకం. అందుకే రాఖీభాయ్ లాంటి మోన్ స్టార్ తో పోటిపడటం ఎందుకని తమ సినిమాలని మే నెలకు పోస్ట్ పోన్ చేసుకున్నారట. విశ్వక్ సేన్ నటించిన 'అశోక వనంలో అర్జున కల్యాణం' మే 6న విడుదల కానుండగా నాగశౌర్య నటించిన 'కృష్ణ వ్రింద విహారి' రిలీజ్ డేట్ ప్రకటించాల్సి వుంది. ఈ మూవీని నాగశౌర్య మదర్ ఐరా క్రియేషన్స్ బ్యానర్ పై నిర్మించారు. దీంతో ఈ మూవీ నాగశౌర్యకు అత్యంత కీలకంగా మారింది.


# 'ఆచార్య' ప్రీ రిలీజ్ వేదిక ఏ కారణంగా మారినట్లు?



మెగాస్టార్ చిరంజీవి కథానాయకుడిగా కొరటాల శివ దర్శకత్వంలో 'ఆచార్య' తెరకెక్కుతోన్న సంగతి తెలిసిందే. ఇందులో సిద్ద అనే పాత్రలో మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ కీలకపాత్ర పోషిస్తున్నాడు. ఇప్పటికే రిలీజ్ అయిన ట్రైలర్ మెగా అభిమానులకు బిగ్ ?రీట్ లా ఉంది. 'ఆచార్య'..'సిద్ధ' పాత్రలు ఎంత పవర్ ఫుల్ గా ఉంటాయో ట్రైలర్ లో నే తెలిసిపోతుంది.మెగా స్టార్ ఇమేజ్ని ఏమాత్రం తగ్గకుండా కొరటాల మార్క్ సెన్సిబుల్ మార్క్ తో తెరకెక్కింది. ఫస్ట్ లుక్ పోస్టర్లు అంతే క్యూరియాసిటీని రెట్టింపు చేస్తున్నాయి. అన్ని పనులు పూర్తిచేసుకుని సినిమా ఏప్రిల్ 29న రిలీజ్ కి రెడీ అవుతోంది. దీనిలో భాగంగా ప్రీ రిలీజ్ ఈవెంట్ ని 23న భారీ ఎత్తున నిర్వహిస్తున్నారు. మెగా అభిమానుల సమక్షంలో యూసఫ్ గూడలోని పోలీస్ గ్రౌండ్ అందుకు వేదిక అయినట్లు సమాచారం.ఎలాంటి అడ్డంకులు లేకుండా తెలంగాణ ప్రభుత్వం అనుమతులు కూడా జారీ చేసింది. అయితే ఈ వేడుకకు పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ కూడా వస్తున్నట్లు సమాచారం. చిరంజీవి..చరణ్ ల కోరిక మేరకు పవన్ కి ఆహ్వానం అందిందిట. దీంతో పవన్ ఈ వేడుకకు తప్పక హాజరయ్యే అవకాశం ఉందని తెలుస్తోంది. ఇదే నిజమైతే మెగా అభిమానులకు ట్రిపుల్ ట్రీట్ షురూ అయినట్లే. ఒకే వేదికపై చిరంజీవి..పవన్ కళ్యాణ్...రామ్ చరణ్ లను చూసుకోవడం అంటే అభిమానులకు పెద్ద పండగే.ముగ్గురిని ఒకే వేదికపై చూసి చాలా కాలమవుతుంది. అప్పుడెప్పుడో చిరంజీవి హీరోగా నటించిన ప్రీ రిలీజ్ వేడుక పంక్షన్ కే ముగ్గురు హాజరయ్యారు. అప్పటికే మెగా ఫ్యామిలీలో చిరు-పవన్ ల మధ్య ఎవో మనస్పర్థలున్నాయాని ప్రచారం సాగింది. ఆవే దుకకు పవన్ రావడంతో ఆ తప్పుడు ప్రచారాలకి ఫుల్ స్టాప్ పడింది. ఆ తర్వాత ఏపీలో వైకాపా ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. పవన్ ఈ ప్రభుత్వానికి పెద్ద విమర్శకుడు.ఇదే ప్రభుత్వంతో చిరంజీవి ఎంతో సన్నిహితంగా మెలుగుతారు. ఆ కారణంగానూ మళ్లీ ఇద్దరి మధ్య పొరపొచ్చాలు తలెత్తినట్లు ప్రచారలోంకి వచ్చింది. వాటికి రేపటి 'ఆచార్య' ప్రీ రిలీజ్ ఈవెంట్ ఫుల్ స్టాప్ పెట్టే అవకాశం ఉంది. అయినా సినిమాలు వేరు..రాజకీయాలు వేరు అని అన్నదమ్ములిద్దరు ఓవైపు చెబుతూనే ఉంటారు. పార్టీల పరంగా వేరైనా..ఒకే ఫ్యామిలీ అంటారు. వాస్తవానికి 'ఆచార్య' ప్రీరిలీజ్ ఈవెంట్ ని విజయవాడలో నిర్వహించి...ఏపీ సీఎం జగన్ మోహన్ రెడ్డి ని ముఖ్య అతిథిగా ఆహ్వానించాలనుకున్నారు. కానీ అనూహ్యంగా ఆ వేడుకని హైదరాబాద్ కి మార్చారు. పవన్ ని రంగంలోకి దించారు.

# తెలుగమ్మాయి రీ ఎంట్రీతో సక్సెస్ అయ్యేనా?

బుల్లి తెరపై తనదైన శైలి తో ఆకట్టుకున్న స్వాతి అలియాస్ కలర్స్ స్వాతి వెండి తెరపై కూడా తనదైన ముద్రను వేసేందుకు ప్రయత్నాలు చేసింది. కాని అది వర్కౌట్ అవ్వలేదు. హీరోయిన్ గా ఆమె చేసిన ప్రయత్నాలు ఒకటి రెండు పర్వాలేదు అనిపించినా మెజార్టీ సినిమాలు నిరాశ పర్చాయి. వేరే భాషలో మాత్రం స్వాతికి మంచి పేరు దక్కింది.నటిగా ఆఫర్లు వస్తున్న సమయంలోనే సినిమాలకు దూరం అయ్యింది.పెళ్లి చేసుకున్న తర్వాత విదేశాలకు వెళ్లి సెటిల్ అయిన స్వాతి మళ్లీ నటిగా రీ ఎంట్రీ ఇచ్చేందుదకు ప్రయత్నాలు చేస్తుంది. రెండేళ్ల క్రితమే ఈమె నటిగా రీ ఎంట్రీ ఇవ్వాలని ఆశ పడింది. కాని హీరోయిన్ గా ఒకటి రెండు ఆఫర్లు వస్తున్న సమయంలో కరోనా ఎటాక్ అయ్యింది.కరోనా కారణంగా ఈమె నటించిన సినిమా మధ్యలోనే ఆగిపోయింది. ఒకటి రెండు సినిమాలు రావాల్సి ఉన్నా కూడా కనీసం అవి పట్టాలెక్కలేదు. హీరోయిన్ గా స్వాతి మళ్లీ బిజీ అయ్యేందుకు ప్రయత్నాలు చేస్తోంది. ఈ సమయంలో ఆమె నటించిన పంచతంత్రం విడుదలకు సిద్దం అవుతోంది.కరోనా కారణంగా అదుగో ఇదుగో అంటూ వాయిదాలు పడుతూ వచ్చిన పంచతంత్రం త్వరలోనే విడుదల అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి.నటిగా రీ ఎంట్రీ ఇచ్చి వరుసగా ఆఫర్లు దక్కించుకోవాలని ప్రయత్నాలు చేస్తున్న స్వాతికి పూర్తి ఆశలు అన్ని కూడా పంచతంత్రంపైనే ఉన్నాయి అనడంలో సందేహం లేదు. నటిగా ఆమె ఏ స్థాయిలో ఆకట్టుకుంటుంది అనేది చూడాలి.ఇండస్ట్రీలో నటిగా ఎన్నో సినిమాల్లో నటించి మెప్పించిన స్వాతి ఇప్పుడు నటిగా వరుసగా సినిమాలు చేస్తూ ఆకట్టుకుంది. గతంలో సక్సెస్ అయిన వాళ్లు బ్రేక్ తీసుకుని రీ ఎంట్రీ ఇచ్చి మంచి విజయాలను దక్కించుకున్నారు. ఇప్పుడు అదే తరహా లో స్వాతి కూడా ఖచ్చితంగా రీ ఎంట్రీలో సక్సెస్ అవుతుందనే నమ్మకంను ఇండస్ట్రీ వర్గాల వారు వ్యక్తం చేస్తున్నారు.




# ప్రతిష్టాత్మక అవార్డుకు రోహిత్, బుమ్రా ఎంపిక.. కోహ్లికి దక్కని చోటు



లండన్: టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ, భారత పేసు గుర్రం జస్ప్రీత్ బుమ్రాలకు అరుదైన గౌరవం దక్కింది. వీరిద్దరు మరో ముగ్గురితో కలిసి ప్రతిష్టాత్మక విజ్డన్ క్రికెటర్స్ ఆఫ్ ది ఇయర్ 2021 అవార్డుకు ఎంపికయ్యారు. విజ్డన్ టాప్ 5 క్రికెటర్స్ జాబితాలో రోహిత్, బుమ్రాలతో పాటు గతేడాది అద్భుత ప్రదర్శన కనబర్చిన డేవాన్ కాన్వే (న్యూజిలాండ్), ఓలీ రాబిన్సన్ (ఇంగ్లండ్), డాన్ వాన్ నికెర్క్ (దక్షిణాఫ్రికా మహిళా జట్టు సారథి) చోటు దక్కించుకున్నారు. లీడింగ్ క్రికెటర్ ఇన్ ద వరల్డ్ 2022 ఎడిషన్ అవార్డును ఇంగ్లండ్ మాజీ కెప్టెన్ జో రూట్ ఎగురేసుకుపోయాడు. ఈ వివరాలను విజ్డన్ ఎడిటర్ లారెన్స్ బ్రూత్ వెల్లడించారు.2021లో ఏకంగా 6 సెంచరీలు (1708 పరుగులు) సాధించినందుకు గాను రూట్‌ను, ఇంగ్లండ్ గడ్డపై (టెస్ట్ సిరీస్) సత్తా చాటినందుకు గాను రోహిత్ శర్మ, బుమ్రాలను ఆయా అవార్డులకు ఎంపిక చేసినట్లు బ్రూత్ పేర్కొన్నాడు. గతేడాది సమ్మర్‌లో ఇంగ్లండ్ గడ్డపై భారత్ రెండు టెస్టులు గెలవడంలో రోహిత్ శర్మ, బుమ్రా కీలక పాత్ర పోషించారని కొనియాడాడు. ట్రెంట్ బ్రిడ్జ్ వేదికగా జరిగిన తొలి టెస్ట్‌లో వర్షం అంతరాయం కలిగించకుంటే టీమిండియా సునాయసంగా విజయం సాధించి సిరీస్ గెలిచేదని ప్రస్తావించాడు. ఇంగ్లండ్ పర్యటనలో బుమ్రా 4 టెస్ట్‌ల్లో 18 వికెట్లతో పాటు బ్యాటింగ్‌లోనూ సత్తా చాటాడని గుర్తు చేశాడు. ఆ సిరీస్ భారత్ సాధించిన రెండు విజయాల్లో రోహిత్‌ది ముఖ్యపాత్ర అని, లార్డ్స్ టెస్ట్‌లో అతని ప్రదర్శన అద్భుతంగా ఉందని కితాబునిచ్చాడు. ఇంగ్లండ్‌తో సిరీస్‌లో రోహిత్ 4 టెస్ట్‌ల్లో 368 పరుగులు చేసి టీమిండియా బ్యాటింగ్ వెన్నెముకగా నిలిచాడని పేర్కొన్నాడు. కాగా, 5 టెస్ట్‌ల ఇంగ్లండ్ పర్యటనలో భారత్ 2-1 ఆధిక్యంలో ఉండగా, కోవిడ్ కారణంగా చివరి టెస్ట్ రద్దైంది.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH.**
**PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**